మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

25.5.2026 సోమవారం Monday | సంపుటి (Volume): 11 సంచిక (Issue) : 28 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## ప్లే ఆఫ్స్‌కు రాజస్థాన్



## ఉక్రెయిన్‌పై 'ఒరెష్నిక్' క్షిపణితో రష్యా దాడి

నలుగురి మృతి.. 100 మందికి గాయాలు



.. వివరాలు 3లో

## పాక్‌లో రైలుపై ఆత్మాహుతి దాడి

30 మంది మృతి

తామే చేశామని ప్రకటించుకున్న బలోచ్ లిబరేషన్ ఆర్మీ



.. వివరాలు 3లో

## ఉసురు తీసిన సముద్రపు చిప్పలు


నదిలో సేకరణకు వెళ్లి 8 మంది మృతి

ఉత్తరకన్నడ జిల్లాలో ప్రమాదం

.. వివరాలు 3లో



# నిప్పుల కొలిమి



## వడదెబ్బ రాష్ట్రంలో ఒక్కరోజే 42 మంది మృతి

ఒక్క ఉమ్మడి వరంగల్‌లోనే ఆదివారం17 మంది మరణం

ఉమ్మడి ఖమ్మంలో 10 మంది.. కరీంనగర్‌లో 8 మంది మృతి

నల్లగొండ జిల్లాలో ఐదుగురి కన్నుమూత

మూడు రోజుల్లో 100 మంది పైనే మృత్యువాత

పగలంతా ఎండ, వడగాలులు.. సాయంత్రం గాలివాన బీభత్సం

ఆదివారం పలు జిల్లాల్లో వర్షాలకు తడిసిన ధాన్యం, మక్కలు

హైదరాబాద్ సహా అనేక ప్రాంతాల్లో 43 డిగ్రీలకు పైగానే..




జనతా న్యూస్ : రాష్ట్రంలో భానుడి భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఎండవేడిమికి తాళలేక పిట్టల్లా రాలిపోతున్నారు. రోజూ పదుల సంఖ్యలో వడదెబ్బ మరణాలు నమోదవుతున్నాయి. గతకొద్ది రోజులుగా రాష్ట్రంలో రోజూ వడదెబ్బతో 30-40 మంది వరకు మరణిస్తున్నారు. ఆదివారం కూడా రాష్ట్రవ్యాప్తంగా 42 మంది వడదెబ్బతో మరణించారు. మరోవైపు వర్షాలు, పిడుగుపాట్లు కూడా ప్రాణాలు

మిగతా 2 లో

## మీ వీసా విధానంతో మాకు తీవ్ర నష్టం

### అమెరికా వీసా సంస్కరణలపై రుబియోతో విదేశాంగ మంత్రి జైశంకర్



3

అమెరికా తన వీసా విధానంలో తీసుకొచ్చిన మార్పులతో భారతీయులు తీవ్రంగా నష్టపోతున్నారని విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. గ్రీన్‌కార్డులు, హెచ్1బీ వీసాల జారీలో మార్పులు అమెరికాలో స్థిరపడాలనుకునే భారతీయులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. భారత పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో జైశంకర్ ఆదివారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

## ఏడాదిలోపు మోదీ సర్కార్ పతనం!

### విధాన వైఫల్యం వల్లే ఆర్థిక సంక్షోభం

నీట్ పరీక్ష లీకేజీపై విద్యామంత్రి రాజీనామా చేసేవరకు విశ్రమించం

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జూన్ 6న మైనారిటీ, ఎస్సీల ఉమ్మడి సదస్సు

భవిష్యత్‌లో హిందూ-ముస్లిం రాజకీయాలు ఉండవు

అసమానతలే జాతీయ సమస్యగా మారతాయ్: కాంగ్రెస్ నేత రాహుల్

బీజేపీ ఆగ్రహం.. విదేశీ శక్తులతో కలిసి కుట్ర చేస్తున్నారని ధ్వజం

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇంకో ఏడాది కంటే మనుగడ సాగించజాలదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో ఆర్థిక సంక్షోభానికి దాని విధాన వైఫల్యమే కారణమన్నారు. నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు కాంగ్రెస్ విశ్రమించదని స్పష్టంచేశారు. ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ మైనారిటీ విభాగం సలహామండలి సమావేశంలో రాహుల్ మాట్లాడారు.





## వైట్‌హౌస్ సమీపంలో కాల్పుల కలకలం

కాల్పులకు తెగబడిన దుండగుడిపై భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు.. తీవ్రగాయాలతో ఆస్పత్రిలో మృతి

3

అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం సమీపంలో కాల్పుల కలకలం చోటు చేసుకుంది. సీక్రెట్ సర్వీస్ చెక్ పాయింట్ వద్దకుబ్యాగులో తుపాకీతో దూసుకొచ్చిన ఓ దుండగుడు భద్రతా సిబ్బందిపై కాల్పులకు తెగబడ్డాడు. దీంతో అప్రమత్తమైన వారు ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఘటనలో దుండగుడికి తీవ్ర గాయాలవ్వగా.. ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు.

## ప్రతి కుటుంబానికీ 'ఇందిరమ్మ బీమా'

కోటి 15లక్షల కుటుంబాలకు ప్రయోజనం

జూన్ 2 నుంచి ప్రారంభిస్తున్నాం: భట్టి విక్రమార్క

పంటల కొనుగోళ్లపై స్పందించని కేంద్రం: తుమ్మల



## కాక్రోచ్ జనతా పార్టీ ఫాలోవర్లపై మాటల యుద్ధం

పాకిస్థానీ ఫాలోవర్ల కోసం ఆరాటాన్ని చూస్తే జాలేస్తోంది: రిజిజు


దేశ యువతను పాకిస్థానీయులంటారా?: దిగ్వి




## యాదగిరీశుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

70వేల మందికి పైగా భక్తుల సందర్శన

ఆదివారం ఒక్కరోజే రూ.78,73,479 ఆదాయం



## ఉచిత విద్యుత్తు రద్దుకు కుట్ర

కేసుల భయంతోనే మోదీకి రేవంత్ సరెండర్

వ్యవసాయం, ఇళ్లలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిర్ణయం

ప్రజల్లో ఉండే వారికే కార్పొరేషన్ ఎన్నికల్లో అవకాశం: కేటీఆర్

03



మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
సోమవారం 25 మే 2026


# ప్రతి కుటుంబానికీ 'ఇందిరమ్మ బీమా'

## కోటి 15లక్షల కుటుంబాలకు ప్రయోజనం
## జూన్ 2 నుంచి ప్రారంభిస్తున్నాం: భట్టి విక్రమార్క
## పంటల కొనుగోళ్లపై స్పందించని కేంద్రం: తుమ్మల



**హైదరాబాద్, మే 24 :** రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి పేద, ధనిక, కుల, మతం అనే భేదం లేకుండా కోటి 15 లక్షల కుటుంబాలకి 'ఇందిరమ్మ బీమా పథకాన్ని' అమలు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకంలో అన్ని కుటుంబాలకు 5 లక్షల రూపాయల బీమాను వర్తింప జేస్తున్నామన్నారు. జూన్ 2వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించనున్నటు వెల్లడించారు. సుడా చైర్మన్‌గా ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ చైర్మన్ ఎండీ ఖాదర్‌బాబా పదవీ స్వీకారం చేపట్టిన సందర్భంగా ఆదివారం ఖమ్మం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి తుమ్మల తదితరులు పాల్గొ న్న ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజల అవసరాల్ని పక్కన పెట్టి, కేవలం కేసీఆర్‌కి సంబంధించిన కుటుంబ అవసరాల కోసమే పనిచేశారని, ఈ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. కాగా, కనీస మద్దతు ధరల ప్రకటనలకే కేంద్ర ప్రభుత్వం పరిమితమవుతున్నదని, పంట ఉత్పత్తుల కొనుగోళ్లుపై ఏమాత్రం స్పందించటంలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే నిధులు సర్దుబాటుచేసి కనీస మద్దతు ధరకు పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నదని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాలు

## ప్రయాణికుల భద్రతకు హైటెక్ రక్షణ కవచం
## 'బస్సులో భరోసా' పేరిట నిరంతరం పర్యవేక్షణ
## ఆదిలాబాద్‌లో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం

**హైదరాబాద్, మే 24 :** ఆర్టీసీ ప్రయాణికుల రక్షణకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రయాణికులకు రక్షణ కల్పిస్తూ.. ప్రశాంతమైన వాతావరణంలో తమ గమ్యస్థానాలకు చేరుకునేలా బస్సుల్లో అత్యాధునిక సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ 'బస్సులో భరోసా' పేరిట సరికొత్త హైటెక్ భద్రతా ప్రాజెక్టును అమల్లోకి తెచ్చింది. తొలి దశలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని ప్రారంభించారు. ఈ సరికొత్త భద్రతా వ్యవస్థ కింద ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని సుమారు 175 బస్సుల్లో ఈ అత్యాధునిక నిఘా నేత్రాలను అమర్చారు. ఈ విజువల్స్ అటు డ్రైవర్, కండక్టర్లకు అందుబాటులో ఉండటమే కాకుండా ఆర్టీసీ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించేలా కనెక్ట్ చేశారు. దీనివల్ల బస్సుల్లో దొంగతనాలు చేసే ముఠాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ముందే గుర్తించి అప్రమత్తం కావడానికి అవకాశం ఉ ంటుంది. మహిళా ప్రయాణికులపై వేధింపులు, దొంగతనాలు, అనుచిత ప్రవర్తన వంటి ఘటనలకు చెక్ పెట్టేలా ఆర్టీసీ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో సుదూర ప్రాంతాలకు ఒంటరిగా ప్రయాణించే మహిళలు, వృద్ధ ప్రయాణికులకు ఆర్టీసీ చర్య భరోసా కల్పించనుంది. ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు సాధించే ఫలితాలను బట్టి రాష్ట్రంలోని అన్ని డిపోల బస్సుల్లో సీసీ కెమెరాలకు అమర్చేందుకు సంస్థ యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కాగా, ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని సంస్థ ఎండీ వై. నాగిరెడ్డి తెలిపారు. ప్రయాణికులకు భద్రతతోపాటు సిబ్బంది పనితీరు మెరుగుపడుతుందని, ప్రయాణికుల పట్ల సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

# మేడిగడ్డ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ మెయిన్ క్యాంప్ ఆఫీసులో అగ్నిప్రమాదం

## దగ్ధమైన ఫైళ్లు, కంప్యూటర్లు, గెస్ట్‌హౌస్

**మహదేవపూర్ :** మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ మెయిన్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైపోయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని ఈ కార్యాలయంలో పలు కంప్యూటర్లు, ఫైళ్లు, ఎల్అండ్‌టీ అధికారులు బస చేసే గెస్ట్‌హౌస్ కాలిబూడిదయ్యాయి.. ఈ ఘటనపై మేడిగడ్డ ఇంజనీరింగ్ అధికారులను సంప్రదించగా పక్కనే ఉన్న పంట పొలాల నుంచి మంటలు వ్యాపించడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా.. ఉద్దేశపూర్వకంగా నిప్పుపెట్టారా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం నుంచి కుంగుబాటు వరకు నిత్యం వార్తల్లో నిలవడంతో ఎల్అండ్‌టీ కార్యాలయం దగ్ధం కావడం చర్చనీయాంశమైంది.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి

## ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి

**హైదరాబాద్ :** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

# నిప్పుల కొలిమి

మొదటి పేజీ తరువాయి



తీస్తున్నాయి. పగలంతా తీవ్రమైన ఎండలు, సాయంత్రం కాగానే విపరీతమైన గాలివాన భీభత్సం సృష్టిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఉదయం 8-9 గంటల నుంచే మాడు పగిలే వేడి కనిపిస్తోంది. ఆదివారం రాష్ట్రంలో అనేకచోట్ల 43 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమొదయ్యాయి. సాయంత్రం కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని మక్కలు, వడ్లు తడిసిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా నిప్పుల కొలిమిలా మారింది. జిల్లాలో ఆదివారం ఒక్కరోజే వడదెబ్బతో 17 మంది మరణించారు. వరంగల్ నగరంలోని ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట ప్రాంతాలకు చెందిన ఆవునూరి రాజు (46), బేతి అశోక్ (55), చింతనూరి సరోజ(70), మైదం శ్రీను (55) వడదెబ్బతో మరణించినట్లు వారి కుటుంబసభ్యులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రానికి చెందిన వీరగాని వీరమ్మ (84), కొత్త రామయ్య (86), తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన అత్తిలి రాము (60), టీక్యాతండాకు చెందిన జాటోత్ బీమోజీ (85), నాంచారిమదూరుకు చెందిన సోమ నారాయణ (65), కేసముద్రం స్టేషన్ బడితండాకు చెందిన అజ్మీరాలచ్యా (72), గూడూరు మండల కేంద్రంలోని చిట్యాల గడ్డకు చెందిన పాపాని ఎల్లమ్మ (68), తొర్రూరు పట్టణానికి చెందిన పైండ్ల నర్సయ్య (43), జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన తేలు పెద్ది మల్లవ్వ (70), వర్ధన్నపేటకు చెందిన చందు ఐలయ్య(88) వడ దెబ్బతో చనిపోయారు.

శాయంపేట మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన కుక్కల సారయ్య(74) వడదెబ్బతో ఆయిల్‌పామ్ తోటలో మృతి చెందగా.. యజమాని తీరుపై ఆగ్రహించిన మృతుడి కుటుంబ సభ్యులు జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో మొలుగూరి నర్సింహరాములు (62) గేదెలను మేతకు తీసుకెళ్లి ఎండకు అస్వస్థతకు గురై మృతిచెందాడు. పరకాల మండలం వెల్లంపల్లి గ్రామంలో నూక సాంబయ్య (65) శనివారం వ్యవసాయ పనులకు వెళ్లి అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం ఉదయం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం వడదెబ్బతో 10 మంది చనిపోయారు. మధిర మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన కొరివి అచ్చయ్య(79), నేలకొండపల్లి మండలం మూటాపురం, నేలకొండపల్లికి చెందిన నంబూరి చిన నారాయణ(45), భీమాల వెంకటేశ్వర్లు (53), ఖమ్మం నగరంలోని పాతబస్టాండ్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఎండదెబ్బతో మృతి చెందాడు. కూసుమంచి మండలం గట్టుసింగారం గ్రామానికి చెందిన సాయి చరణ్(35), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడుకు చెందిన వంశీకృష్ణ(33), భద్రాచలంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన మాటూరి సావిత్రి (71), కండె వెంకన్న(42), చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామానికి చెందిన ఎన్.రజినీకాంత్ (36), ఖమ్మంలోని రామన్నపేటకు చెందిన గురజాల ఏడుకొండలు(50) వడదెబ్బతో ఆదివారం మృతి చెందారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం వడదెబ్బతో ఐదుగురు మరణించారు. నిడమనూరు మండలం నారాయణగూడెంకు చెందిన పల్లా నర్సిరెడ్డి (74), యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన కామిటికారి వెంకటేష్ (47), సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం ఇస్తాళాపురంలో మడిపల్లి ఐలయ్య (66), కోదాడకు చెందిన ఏర్పుల శివ (40), నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో పంజాబ్‌కు చెందిన జైపాల్‌సింగ్ (36) వడదెబ్బకు మృతిచెందారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆదివారం వడదెబ్బతో 8 మంది మృతి చెందారు. హుజూరాబాద్ పట్టణానికి చెందిన టేకుల రాజు (45), జమ్మికుంట పట్టణంలోని శివాలయం వద్ద భిక్షాటన చేసే 65 ఏళ్ల వృద్ధుడు వడదెబ్బతో ఆదివారం చనిపోయారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన యాదగిరి కనకయ్య(60), ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామానికి చెందిన గంద్ర సత్తమ్మ(65), య్నైటింక్లయిన్‌కాలనీకి చెందిన ముత్యం అశోక్(39), జగిత్యాల మండలం రాయికల్ పట్టణానికి చెందిన ఎద్దండి రాజవ్వ (85), గోదావరిఖనిలో సంపత్ (50) అనే మెకానిక్ వడదెబ్బకు మరణించారు. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండల కేంద్రానికి చెందిన ఆదే లోడన్న (52) వడదెబ్బతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. లోడన్న సోదరుడు గణపతి శనివారం మృతి చెందాడు. నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలో జేవిలాల్ (46) అనే వ్యక్తి మృతిచెందాడు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం బాదంపల్లిలో నరేశ్ (34) వడదెబ్బతో చనిపోయాడు.

## హైదరాబాద్‌లో భగభగలు

హైదరాబాద్‌లోనూ వేసవి ప్రతాపం తీవ్రంగా ఉంది. ఆదివారం కార్వాన్‌లో 42.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మలక్‌పేటలో 42.6 డిగ్రీలు, ఉప్పల్, హయత్‌నగర్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో 42.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం సమయంలో రోడ్లపై రద్దీ తగ్గింది. గాలిలో తేమశాతం పెరగడంతో ఉక్కపోత పెరిగింది.

## పగలంతా ఎండ.. సాయంత్రం గాలివాన

పలు జిల్లాలో పగలంతా తీవ్రమైన ఎండలు.. సాయంత్రం కాగానే గాలివాన భీభత్సం సృష్టిస్తున్నాయి. నిజామాబాద్ జిల్లాలో ఆదివారం అన్ని మండలాల్లో 43 డిగ్రీలపైనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా మెండోరలో 45.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పగలంతా ఎండ తీవ్రత కొనసాగింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురుగాలులతో వర్షం కురిసింది. కృష్ణ మండలంలో అత్యధికంగా 54 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వనపర్తి జిల్లాలో రెండు రోజులుగా సాయంత్రం, రాత్రి వేళల్లో వర్షాలు పడుతున్నాయి. అయినా ఎండ తీవ్రత మాత్రం కొనసాగుతూనే ఉంది. ఆదివారం అత్యధికంగా మదనాపురం మండలంలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో కూడా పలుచోట్ల వర్షాలు కురిశాయి. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న మొక్కజొన్న రాశులు తడిసిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం పగలంతా తీవ్రమైన ఎండలు కాయగా, రాత్రి పలు చోట్ల ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని గాజులపేట గ్రామానికి చెందిన రైతు ఆనె సత్యనారాయణ పొలంలో కట్టేసి ఉన్న కాడెద్దులు సోమవారం తెల్లవారుజామున పిడుగుపాటుతో మృతి చెందాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని గుండాలకు చెందిన వావిళ్ల చిట్టెమ్మ పొలంలో కట్టేసిన పాడి ఆవు పిడుగుపాటుకు మృతి చెందింది. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పలు చోట్ల ఆదివారం సాయంత్రం వర్షం బీభత్సం సృష్టించింది. బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల్, కొడంగల్ మండలాల్లో ఉరుములు, మెరుప్పులు, ఈదురు గాలులతో వర్షం కురిసింది. బొంర్షసపేట్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది. దౌల్తాబాద్ మండలం దేవరఫస్లాబాద్, గోకఫస్లాబాద్, దౌల్తాబాద్, ఈర్లపల్లి, చెల్లాపూర్ గ్రామల్లో పొలాల వద్ద వడ్లు తడిసిముద్దయ్యాయి. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం వర్షానికి ధాన్యం, మొక్కజొన్నలు తడిసిపోయాయి. మర్పల్లిలో రెండెకరాల అరటితోట ఈదురు గాలులుకు నేలవాలింది. బషీరాబాద్ మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. తలకొండపల్లి మండలం తుమ్మలకుంట తండాలో పిడుగుపడి ఒక ఆవు మృతిచెందింది.

# హైదరాబాద్‌లో రోగికి.. చైనా నుంచి సర్జరీ

## వూహాన్‌లోని టోంగ్జి ఆస్పత్రిలో భారతీయ వైద్యుడు.. భాగ్యనగరంలోని ఏఐఎన్‌యూలో 63 ఏళ్ల పేషెంట్
## అక్కణ్నుంచే యురేటరల్ రీ-ఇంప్లాంటేషన్‌సర్జరీని 90 నిమిషాల్లో పూర్తిచేసిన డాక్టర్ మహ్మద్ గౌస్
## 7 వేల కి.మీ. దూరంలోని 2 ఆస్పత్రుల మధ్య సాంకేతిక అనుసంధానం
## రోబోటిక్స్, అత్యంత వేగవంతమైన 5జీ ఇంటర్‌నెట్‌తో సాధ్యం




**హైదరాబాద్ :** ఆధునిక వైద్య సాంకేతికేత దేశాల మధ్య దూరాన్ని చెరిపేస్తోంది. సర్జరీలకు సరిహద్దులు ఉండవని వైద్యనిపుణులు నిరూపించారు. ఎక్కడో 7 వేల కిలోమీటర్లకు పైగా దూరాన, చైనాలోని వూహాన్ నగరంలో ఉన్న ఓ భారతీయ వైద్యుడు.. ఇక్కడ హైదరాబాద్‌లోని 'ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆస్పత్రిలోని పేషెంట్‌కు క్లిష్టమైన రోబోటిక్ శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడడమే ఇందుకు రుజువు. అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీ, వేగవంతమైన 5జీ ఇంటర్‌నెట్ సదుపాయంతో ఈ శస్త్రచికిత్స నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఒక మహిళ (63) మూత్రాశయ సంబంధిత ఇబ్బందులతో బాధపడుతూ ఏఐఎన్‌యూ వైద్యులను సంప్రదించారు. అదే సమయంలో.. ఆస్పత్రికి చెందిన యూరాలజిస్టు డాక్టర్ సయ్యద్ మహ్మద్ గౌస్.. వుహాన్‌లోని టోంగ్జీలో జరుగుతున్న 'ఇంటర్నేషనల్ హెపటో పాంక్రియాటో బైలియరీ అసోసియేషన్' చైనీస్ చాప్టర్ 10వ కాంగ్రెస్‌కు హాజరయ్యారు. ఆ సదస్సులో.. కొత్తగా వచ్చిన రోబోటిక్ టెక్నాలజీ ఎంత బాగా పనిచేస్తుందో అక్కడికి వచ్చిన వైద్యనిపుణులందరికీ చూపించడానికి లైవ్‌గా 26 ఆపరేషన్లు చేశారు. వాటిలో ఐదు.. అక్కణ్నుంచీ విదేశాల్లో ఉన్న పేషెంట్లకు చేసినవి. ఆ ఐదింటిలో ఒకటి.. డాక్టర్ సయ్యద్ మహ్మద్ గౌస్ చేసిన 'యురేటరల్ రీ-ఇంప్లాంటేషన్' సర్జరీ.

## శస్త్రచికిత్స ఇలా..

వుహాన్‌లోని టోంగ్జి ఆస్పత్రి వైద్య బృందం, డాక్టర్ గౌస్.. ఇక్కడ హైదరాబాద్ వైద్యులు.. అంతా కలిసి సమన్వయంతో ఈ సర్జరీ నిర్వహించారు. శస్త్రచికిత్సకు ముందు రెండు నగరాల్లోని వైద్యులూ రోగి వైద్య చరిత్ర, స్కానింగ్ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించారు. టోంగ్జి ఆస్పత్రిలోని రోబోటిక్ సిస్టమ్‌కు హైదరాబాద్‌లోని ఏఐఎన్‌య-ంలోని రోబోటిక్ వ్యవస్థను అనుసంధానం చేశారు. రోబోటిక్ చేతుల కదలికలకు సంబంధించిన మార్గదర్శకాలను ముందుగానే రూపొందించారు. తర్వాత హైదరాబాద్ వైద్యులు రోగికి మత్తుమందు ఇచ్చి, ఆపరేషన్ థియేటర్‌లో రోబోటిక్ పరికరాలను సిద్ధం చేశారు. రోబోటిక్ వ్యవస్థలో అమర్చిన అత్యాధునిక 3డి కెమెరాలు ఇక్కడి దృశ్యాలను వూహాన్‌లోని డాక్టర్ గౌస్‌కు ప్రత్యక్ష ప్రసారం చేయడం ప్రారంభించాయి. అక్కడ ఆయన ఒక ప్రత్యేక కన్సోల్ వద్ద కూర్చొని రోబోటిక్ చేతులను నియంత్రిస్తూ.. హైదరాబాద్‌లోని రోగికి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. 5జీ నెట్‌వర్క్ సాయంతో కేవలం 200 మిల్లీసెకన్లలోనే ఆదేశాలు చేరడంతో రోబోటిక్ చేతులు వైద్యుడి చేతి కదలికలను వెంటనే అనుసరించాయి. దీంతో ఆపరేషన్ అత్యంత కచ్చితత్వంతో సాగిందని.. 90 నిమిషాల్లో పూర్తయిందని వైద్యులు తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే సర్జరీని కొనసాగించడానికి వీలుగా.. శస్త్రచికిత్స జరుగుతున్నంతసేపూ హైదరాబాద్ వైద్య బృందం ఆపరేషన్ థియేటర్‌లోనే ఉంది. భవిష్యత్తులో దూర ప్రాంతాల్లో ఉన్న రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో.. ఈ తరహా రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీలు కీలక పాత్ర పోషిస్తాయని వైద్యనిపుణులు పేర్కొన్నారు.

# ఉచిత విద్యుత్తు రద్దుకు కుట్ర

**కేసుల భయంతోనే మోదీకి రేవంత్ సరెండర్**

**వ్యవసాయం, ఇళ్లలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిర్ణయం**

**ప్రజల్లో ఉండే వారికే కార్పొరేషన్ ఎన్నికల్లో అవకాశం: కేటీఆర్**



**హైదరాబాద్ మే 24 :** 'కేసుల భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి సరెండర్ అయ్యాడు. అందుకే రాష్ట్రంలో ప్రీ పెయిడ్ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లకు మీటర్లు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును రద్దు చేసి అదానీ, అంబానీ వంటి ప్రీ పెయిడ్ సంస్థలకు అప్పగించే కుట్ర చేస్తున్నారు. ఈ నిర్ణయం అమలు కాక ముందే కాంగ్రెస్ ఫ్యూజ్‌లు పీకేయాలి, అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. 'నా బూతు.. నా భవిష్యత్తు' పేరిట అంబర్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి చీఫ్ మినిస్టర్(సీఎం) కాదు... కటింగ్ మాస్టర్ (సీఎం) అని కేటీఆర్ దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో నిర్మాణం చేపట్టి పూర్తయిన వంతెనలు, భవనాలకు జేబులో కత్తెర పెట్టుకొని ప్రారంభిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రతి ఒక్కరి ఇంట్లో ప్రస్తుతం ఉన్న కరెంటు మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని, మంత్రివర్గంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ మీటర్లు వస్తే.. మొబైల్ ఫోన్ల తరహాలో ముందే రీ చార్జ్ చేసుకొని.. బ్యాలెన్స్ మేరకు విద్యుత్ వినియోగించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో కాంగ్రెస్ చేస్తోన్న కుట్రలపై ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో మోదీ ఎంత ఒత్తిడి చేసినా.. రూ.30 వేల కోట్ల రుణం రాష్ట్ర ప్రభుత్వానికి ఆపినా.. కేసీఆర్ ఎదురించారే తప్ప.. మీటర్లు పెట్టేందుకు అంగీకరించలేదని పేర్కొన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో అర్హుల ఓట్లు జాబితా నుంచి తొలగించకుండా జాగ్రత్తగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బీజేపీ వాళ్లు కొందరి ఓట్లు తొలగించే కుట్ర చేస్తారని, వారితో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. డిసెంబరు లేదా జనవరిలో కార్పొరేషన్ల ఎన్నికలు ఉండే అవకాశముందన్నారు. ఎమ్మెల్యేలు, పెద్ద నాయకుల చుట్టూ తిరగకుండా ప్రజల్లో ఉండి.. వారి సమస్యలపై పోరాడిన, సభ్యత్వ నమోదులో కీలకంగా వ్యవహరించిన వారికి సర్వేల ఆధారంగా పార్టీ టికెట్ ఇస్తామని కేటీఆర్ చెప్పారు.

# బీఆర్ఎస్‌ను తేలును చంపినట్లు చెప్పుతో కొట్టి చంపాలి

**రాష్ట్రంలో ఆ పార్టీ పనైపోయింది**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



**హైదరాబాద్, మే 24 :** తేలు ముందుకు వెళ్తూ.. వెనుక నుంచి విషంతో కాటు వేసినట్టుగానే బీఆర్ఎస్ పార్టీ విధానాలు ఉన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. తేలుని చెప్పుతో కొట్టి చంపినట్టుగానే బీఆర్ఎస్ పార్టీనీ కూడా చెప్పుతో కొట్టి చంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పనైపోయిందని, కొన్ని మీడియా, సోషల్ మీడియాలకే ఆ పార్టీ పరిమితమైందని అన్నారు. ఖమ్మంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సారు.. కారు.. 16 అని ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్.. ఎంపీతో పాటు ఎమ్మెల్సీలను కూడా గెలవలేకపోయిందని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ దగ్గరకు వంద సార్లు వెళ్లి నిధులు తెచ్చుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. బయట మాత్రం కేంద్రం నిధులు ఇవ్వడం లేదని చెబుతున్నారని ఆరోపించారు. గతంలో కేసీఆర్ కూడా ఇలానే వ్యవహరించారని, అందుకే ప్రజలు వారిని ఇంటికి పంపారని గుర్తు చేశారు. రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో బీజేపీ గెలిచి అధికారంలోకి రాబోతుందని పేర్కొన్నారు. ఇక, ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఏం లాభం లేదని, రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని రాంచందర్‌రావు మండిపడ్డారు. ధాన్యం, మొక్కజొన్న ఇతర పంటల కొనుగోలు అంశంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు బేడీలు వేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. రైతు ఉత్పత్తులను కొనుగోలు చేయటానికి గోనే సంచులు, లారీలను కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని రాంచందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

**'గోదావరి'లో ప్రాజెక్టులను పూర్తి చేయండి**

గోదావరి బేసిన్‌లో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల ను తక్షణం పూర్తి చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి రాంచందర్‌రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణాకు 360 టీఎంసీల గోదావరి జలాల వినియోగానికి సంబంధించిన ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులిచ్చిందని పేర్కొన్నారు. ఇందులో కాళేశ్వరం- 237 టీఎంసీలు, సీతారామ - 67 టీఎంసీలు, సమ్మక్కసాగర్-47 టీఎంసీలు, చిన్న కాళేశ్వరం-4.5 టీఎంసీలు, మోదికుంటవాగు-2.1టీఎంసీలు, చనాకా-కొరాట 2టీఎంసీలు, గూడెం లిఫ్ట 3 టీఎంసీల ప్రాజెక్టులు ఉన్నాయని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలను సరిదిద్దడంపై ఎన్‌డీఎసఏ చేసిన సిఫారసులను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.

# ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ ద్రోహం: వాకిటి

**షాద్‌నగర్/న్యూఢిల్లీ, మే 24 :** ప్రాజెక్టుల నిర్మాణం పేరిట గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.58 వేల కోట్లు మంజూరు చేసి రూ.28 వేల కోట్లు మాత్ర మే వెచ్చించిందని తెలిపారు. పైగా అరకొర పనులు చేసి 90% పూర్తిచేశామని బీఆర్ఎస్ నేతలు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టుల అంశంలో బీఆర్ఎస్ పాలకులు ప్రజలకు ద్రోహం చేశారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజలను నమ్మించి మోసం చేస్తే.. తమ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు న్యాయం చేస్తున్నారని తెలిపారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు తాగు, సాగు నీరందించేందుకు కుర్చీవేసుకుని లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ కడతామని చెప్పిన కేసీఆర్.. భూ సేకరణైనా చేపట్టలేదన్నారు.

**ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో మంత్రి వాకిటి శ్రీహరి భేటీ**

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి వాకిటి శ్రీహరి భేటీ అయ్యారు. ఆదివారం రాత్రి న్యూఢిల్లీ రాజాజీమార్గ్‌లోని నివాసంలో ఖర్గేను శ్రీహరి కలిశారు. ఆదివారం మధ్యాహ్నమే మంత్రి హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయలుదేరి ఢిల్లీకి వచ్చారు. విమానాశ్రయం నుంచి నేరుగా ఖర్గే నివాసానికి వెళ్లి ఆయనతో సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలకు పైగా ఖర్గేతో భేటీ జరిగింది. అయితే, తెలంగాణ మంత్రివర్గ విస్తరణ, ప్రక్షాళన జరుగుతుందనే ప్రచారం ఊపందుకున్న నేపథ్యంలో ఖర్గేతో శ్రీహరి భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై ఖర్గే ఆరా తీసినట్లు తెలిసింది.

# నేటి నుంచి మహిళా వారోత్సవాలు: సీతక్క

**హైదరాబాద్, మే 24 :** 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. మహిళలను సంక్షేమ పథకాల లబ్ధిదారుల స్థాయి నుంచి పారిశ్రామికవేత్తలుగా, సంపద సృష్టికర్తలుగా ఎదిగేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆదివారం ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వారోత్సవాల సందర్భంగా 25న గ్రామ, మండలస్థాయిలో 8 వేల ఇందిరా మహిళాశక్తి భవనాలకు శంకుస్థాపనలు, 26న మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహించే 553 ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవం, 27న సోలార్ ప్లాంట్ల ప్రారంభం, ప్రత్యేక సాధారణ సమావేశాలు, 29న ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్, రుణమేళాలు, జీవనోపాధి యూనిట్ల ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు. 30న 'అమ్మకు అక్షరమాల' ద్వారా అక్షరాస్యత సాధించిన మహిళలను జిల్లా, మండల స్థాయిలో సన్మానించనున్నామని, 31న ముగింపు కార్యక్రమం ఉంటుందని మంత్రి వెల్లడించారు.

# అందరూ పార్టీ కోసం పనిచేయాల్సిందే

**పాలకుర్తి నియోజకవర్గ నేతల వివాదంపై టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి**

**హైదరాబాద్, మే 24 :** పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతల మధ్య వివాదంపై ఆ జిల్లా నేతలతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తాను మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని టీపీసీసీ క్రమశిక్షణా చర్యల అమలు కమిటీ చైర్మన్ మల్లు రవి వెల్లడించారు. అంతిమంగా పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసి పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. పాలకుర్తి నేతల మధ్య వివాదంపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ ఆదివారం గాంధీభవన్‌లో భేటీ అయింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మల్లు రవి మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గ నేతలు హరిప్రసాద్, కృష్ణకిషోర్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారంటూ నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి క్రమశిక్షణా చర్యల అమలు కమిటీకి ఫిర్యాదు చేశారన్నారు. అలాగే యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డిలు పార్టీ శ్రేణులను పట్టించుకోవట్లేదన్న ఫిర్యాదూ వచ్చిందన్నారు. కమిటీ.. ఇరు వర్గాలనూ పిలిచి మాట్లాడి ఆధారాలు, సమాచారం సేకరించిందన్నారు. ప్రస్తుతం యశస్వినీరెడ్డి విదేశాల్లో ఉన్నందున ఆమె వచ్చాక ఇద్దరూ కలిసి కమిటీ ముందు హాజరు కావాలని ఝాన్సీరెడ్డికి సూచించినట్లు తెలిపారు. ఈ నెల 30న ఈ అంశంపై కమిటీ భేటీ ఉంటుందన్నారు. కాగా, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి వెళ్లాక కామెడీ విలన్ అల్లు రామలింగయ్యలా ఉంటాడనుకున్నామని, కానీ ఆయన ముత్యాలముగ్గు విలన్ రావుగోపాలరావులా తయారయ్యాడని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు. ఆయన బీఆర్ఎస్ ఆత్మను ఎక్కించుకుని పచ్చి అబద్ధాలాడుతున్నాడని దుయ్యబట్టారు. ఈ సీజన్‌లో ప్రభుత్వం ఇప్పటికే 50 లక్షల టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.7,840 కోట్లు ఇప్పటికే రైతులకు చెల్లించిందన్నారు. ధాన్యం కొనుగోలు వ్యవహారంలో బీఆర్ఎస్ కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించట్లేదని నిలదీశారు. దిగజారి.. గుడ్డిగా విమర్శలు చేయడం జీవన్‌రెడ్డికి తగదని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు నెలాఖరుకు పూర్తవ్వాలి

**ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని 72 గంటల్లోగా కొనాలి**

**తర్వాత వచ్చే ధాన్యానికి 10 రోజుల్లోగా చెల్లింపులు పూర్తవ్వాలి**

**తడిసిన ధాన్యాన్ని కొని వెంటనే బాయిల్డ్ మిల్లులకు తరలించాలి**

**రోజుకు 3లక్షల టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకోవాలి**

**ఇప్పటివరకు 51లక్షల టన్నులు కొన్నాం లక్ష్యం 75 లక్షల టన్నులు**

**అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు.. 10 రోజుల ప్రణాళిక ప్రకటన**



**హైదరాబాద్ మే 24 :** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరుకల్లా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లపై ఉత్తమ్‌కుమార్ ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం సేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు ఉత్తమ్ 10 రోజుల ప్రణాళికను ప్రకటించారు. మార్కెట్ యార్డులకు వచ్చే ప్రతి గింజను కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు వచ్చిన 8.50లక్షల టన్నుల ధాన్యాన్ని 72 గంటల్లోగా కాంటా పూర్తి చేసి లోడ్ చేయాలన్నారు. రాబోయే రోజుల్లో వచ్చే 16లక్షల టన్నుల ధాన్యాన్ని 10 రోజు ల్లో కాంటా పూర్తిచేసి రైతులకు చెల్లింపులు చేయాలన్నారు. రోజుకు 3 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులకు టార్గెట్ పెట్టారు. ఇందుకోసం రాత్రి పూట కూడా ధాన్యం కొనుగోళ్లు జరగాలని, గోదాముల సామర్థ్యాన్ని 7లక్షల టన్నుల మేర పెంచుతున్నామని వెల్లడించారు. ఈ వర్చువల్ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లాల కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**కేంద్రం అనుమతిచ్చింది 52లక్షల టన్నులకే**

రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 51లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఉత్తమ్‌కుమార్ తెలిపారు. ఇందుకు గాను రైతులకు రూ.8,749కోట్లు చెల్లించామన్నారు. రాష్ట్రం లో ప్రస్తుత సీజన్‌లో 141లక్షల టన్నుల వరిధాన్యం ఉత్పత్తి అయిందని, ఇందులో 75లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 52లక్షల టన్నుల సేకరణకు మాత్రమే అనుమతి ఇచ్చిందని ఉత్తమ్‌కుమార్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా సరిహద్దు జిల్లాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. తాలు, తరుగు పేరుతో రైస్ మిల్లర్లు, దళారులు రైతులను మోసం చ్తస్త వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా హెచ్చరించారు. రైతులకు నగదు చెల్లింపు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని, వెంటనే ఆ ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించాలని సూచించారు. నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, నారాయణపేట, ఖమ్మం జిల్లాలు ధాన్యం సేకరణలో ముందంజలో ఉన్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. కాగా, వరి ధాన్యం కొనుగోలు విషయంలో తప్పుడు ప్రచారాలను ఖండించాలని, రికార్డు స్థాయిలో కొనుగోళు జరుగుతున్న విషయాన్ని ప్రజలకు చేరవేయాలని చేయాలని ఉత్తమ్ ఆదేశించారు.

**మహిళా సంక్షేమ వారంపై మంత్రి సీతక్క సమీక్ష**

ఉత్తమ్ సమీక్ష అనంతరం ఇదే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు శాఖకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30 వరకు నిర్వహించనున్న 'మహిళా సంక్షేమ వారం' పై చర్చించారు. గ్రామ,మండల స్థాయిలో ఇందిరా మహిళాశక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాలకు శంకుస్థాపన, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్య ప్రత్యేక సమావేశాల నిర్వహణ, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట- అంగన్వాడీ బాటపై కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# పెద్దపులి ఫామ్‌హౌస్‌లో ఉంది

**కేసీఆర్‌ను పులితో పోల్చిన తలసాని**



**హైదరాబాద్ :** 'పులి వ్యవసాయ క్షేత్రం(ఫామ్ హౌస్)లో పడుకొని ఉంది. మన పెద్ద పులి ఒక్కసారి లేచిందనుకో.. చూసింద్రు కదా.. మధ్య, మధ్యలో అట్లా వచ్చి కనిపించి పోతేనే భయం భయం' అంటూ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కేసీఆర్‌ను పులితో పోల్చారు. అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ చరిత్ర, వ్యక్తిత్వం, విజ్ఞానం. ఆలోచనా విధానం రాష్ట్రంలో ఎవరికైనా ఉందా అని ప్రశ్నించారు. చిన్నోడు, పొట్టోడు, పొడుగోడు ఏది పడితే అది మాట్లాడుతున్నరని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, ధైర్యం గా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. ఒక్క బతుకమ్మ కుంట అభివృద్ధి చేసి ఎంతో ప్రచారం చేసుకుంటున్నారని, 1400 చెరువులు అభివృద్ధి చేసినా తాము ఏనాడూ ప్రచారం చేసుకోలేదన్నారు. పార్టీ కార్యక్రమాలు చేయకుండా తప్పించుకుంటున్న నాయకుల విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆయన కేటీఆర్‌ను కోరారు.

# ఉసురు తీసిన సముద్రపు చిప్పలు

## నదిలో సేకరణకు వెళ్లి 8 మంది మృతి.. ఉత్తరకన్నడ జిల్లాలో ప్రమాదం

**బెంగళూరు :** నదిలో లభించే సముద్రపు చిప్పల(శంకు, గవ్వలాంటివి) కోసం వెళ్లి ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది మృత్యువాతపడ్డారు. ఉత్తరకన్నడ జిల్లా భట్కళ్ తాలూకా వెంకటాపుర నదిలో ఆదివారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. శనివారం ఉత్తర కన్నడ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో నదిలో నీటిమట్టం పెరిగింది. చిప్పల కోసం 14మంది వెంకటాపుర నదికి వెళ్లారు. ఒకరికొకరు చేతులు పట్టుకుని నదిలోకి దిగారు. కాళ్లకు తగిలే చిప్పలను సేకరిస్తూ ముందుకెళ్లారు. ఈసందర్భంలో నీటి ప్రవాహం పెరిగి ముందుగా ఇద్దరు నీట మునగగా.. ఒకరికొకరు చేతులు పట్టుకోవడంతో మిగిలినవారు కూడా గల్లంతయ్యారు. మధ్యాహ్నానికి 8మంది మృతదేహాలు ఆళ్వకోడి వద్ద బయటపడ్డాయి. పడుశిరాలిబంగ్రి నివాసి లక్ష్మీమహదేవ నాయక (42), శారదాహొళెకి చెందిన ఉమేశ్ నాయక (30), లక్ష్మీనాయక (30), లక్ష్మీ అణ్ణప్పనాయక (60), లక్ష్మీ శివరామనాయక (49), జ్యోతినాగప్ప నాయక (34), మాలతినాయక (38), మాస్తమ్మనాయక మృతిచెందిన వారిలో ఉన్నట్టు భట్కళ్ పోలీసులు తెలిపారు. నాగరత్న, మహాదేవి ప్రాణాలతో బయటపడ్డారు. వారిని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. మరో నలుగురి ఆచూకీ, వివరాలు తెలియరాలేదు. కాగా, కర్ణాటకలో నదిలో మునిగి ఎనిమిది మృతిచెందిన ఘటనపై ప్రధాని మోదీ స్పందించారు. మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపం తెలిపారు. నదిలో మునిగి ఎనిమిది మంది మరణించడం పట్ల ముఖ్యమంత్రి సిద్దరామయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు.

# ఉక్రెయిన్‌పై 'ఒరెష్నిక్' క్షిపణితో రష్యా దాడి

## నలుగురి మృతి.. 100 మందికి గాయాలు

**కీవ్/మాస్కో:** ఉక్రెయిన్ రాజధాని కీవ్ రీజియన్‌పై డ్రోన్లు, క్షిపణులతో రష్యా మరోసారి విరుచుకుపడింది. శనివారం అర్ధరాత్రి కీవ్ పరిధిలోని 'బిలా త్సెర్క్వా' నగరాన్ని లక్ష్యంగా చేసుకుని తన అత్యంత శక్తిమంతమైన, అణు సామర్థ్యం గల 'ఒరెష్నిక్' హైపర్‌సోనిక్ బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. ఈ దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, సుమారు 100 మంది వరకు గాయపడ్డారని ఉక్రెయిన్ వెల్లడించింది. దాడి కారణంగా నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాలు, పాఠశాలలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించింది. నాలుగేళ్లుగా కొనసాగుతున్న యుద్ధంలో రష్యా ఈ క్షిపణిని ప్రయోగించడం ఇది మూడోసారి. ఈ ఆపరేషన్‌లో కేవలం ఒరెష్నిక్ క్షిపణి మాత్రమే కాకుండా, ఇస్కందర్, కింజాల్, సిర్కాన్ వంటి 90 క్షిపణులతో పాటు సుమారు 600 డ్రోన్‌లను కూడా ప్రయోగించినట్లు రష్యా రక్షణ శాఖ పేర్కొంది.

# పాక్‌లో రైలుపై ఆత్మాహుతి దాడి

## 30 మంది మృతి.. తామే చేశామని ప్రకటించుకున్న బలోచ్ లిబరేషన్ ఆర్మీ

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో రైలుపై జరిగిన ఆత్మాహుతి దాడిలో 30 మంది మృతిచెందారు. వంద మందికి పైగా గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రుల్లో ఎక్కువ మంది సైనికులే ఉన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఘటనకు తమదే బాధ్యత అని బలోచ్ లిబరేషన్ ఆర్మీకి చెందిన మాజీద్ బ్రిగేడ్ ప్రకటించుకుంది. క్వెట్టాలోని చమన్ పట్టక్ సిగ్నల్ వద్ద రైలును పేలుడు పదార్థాలున్న వాహనంతో ఢీ కొట్టారు. పేలుడు ధాటికి మంటలు చెలరేగడంతో పాటు మూడు బోగీలు పట్టాలు తప్పాయి. క్వెట్టా మిలిటరీ కంటోన్మెంట్‌కు చెందిన సైనికులు, వారి కుటుంబ సభ్యులు ప్రయాణిస్తుండటంతో బీఎల్ఏ లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడింది. దాడి సమయంలో రైలులో 300మందికి పైగా పాక్ సైనికులున్నారు. సైనికులే లక్ష్యంగా రైలుపై జరిగిన దాడి పిరికి పందల చర్య అని పాక్ ప్రధాని షెబాజ్ షరీఫ్ విమర్శించారు. క్వెట్టా–పెషావర్ మధ్య నడిచే జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను ఉగ్రవాదులు గతంలోనూ అనేక సార్లు లక్ష్యం చేసుకున్నారు. ఇటీవలి కాలంలో ఈ దాడులు మరింత పెరిగాయి. 2025 మార్చి 11న ఉగ్రవాదులు బొలాన్ ప్రాంతంలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేశారు. 350 మంది ప్రయాణికులను, సైనికులను బందీలుగా చేసుకున్నారు. వీరిని విడిపించేందుకు జరిపిన దాడుల్లో 33 మంది ఉగ్రవాదులు, 30 మంది ప్రయాణికులు, సైనికులు మృతిచెందారు.

# కాక్రోచ్ జనతా పార్టీ ఫాలోవర్లపై మాటల యుద్ధం

## పాకిస్థానీ ఫాలోవర్ల కోసం ఆరాటాన్ని చూస్తే జాలేస్తోంది: రిజిజు


## దేశ యువతను పాకిస్థానీయులంటారా?: దీప్కే




**న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) అంశం రోజురోజుకు సంచలనమవుతోంది. సీజేపీకి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోవర్లపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పరోక్షంగా చేసిన ఓ పోస్టు ఆదివారం తీవ్ర దుమారం రేపింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, కేంద్ర మంత్రి రిజిజు మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. పాకిస్థాన్, జార్జ్ సోరోస్ ముఠా నుంచి సోషల్ మీడియా ఫాలోవర్ల కోసం ఆరాటపడుతున్న వారిని చూస్తుంటే జాలేస్తోందంటూ రిజిజు శనివారం ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. అటు సీజేపీని కానీ మరే పార్టీని, వ్యవస్థను కానీ రిజిజు తన పోస్టులో ప్రస్తావించలేదు. కానీ, సీజేపీ ఫాలోవర్ల సంఖ్యపై చర్చ జరుగుతున్న వేళ ఆయన చేసిన ఈ పోస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, రిజిజు చేసిన పోస్టుకు అభిజిత్ దీప్కే ఎక్స్‌లో ఘాటుగా స్పందించారు. కేంద్ర మంత్రి రిజిజు భారతీయ యువతపై పాకిస్థానీయులనే ముద్ర ఎందుకు వేస్తున్నారు? అంటూ దీప్కే ప్రశ్నించారు. అంతేకాక, తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా హ్యాక్ అవ్వకముందు తమకున్న ఫాలోయర్ల భౌగోళిక సమాచారాన్ని తెలియజేసే డేటా ఎనలిటిక్స్ గ్రాఫ్‌ను చూపించే ఓ స్క్రీన్ రికార్డింగ్ వీడియోను తన పోస్టుకు జత చేశారు. తమ ఖాతాను, పోస్టులను అనుసరించే వారిలో 94% మంది భారతీయులేనని దీప్కే స్పష్టం చేశారు. దీప్కే పోస్టుకు స్పందనగా.. కిరెన్ రిజిజు ఆదివారం సాయంత్రం ఎక్స్‌లో మరో పోస్టు చేశారు. సీజేపీని ప్రస్తావించనప్పటికీ.. దేశ వ్యతిరేక ముఠాలకు చెందినవారు భారతదేశానికి ఎప్పటికీ హీరోలు కారని ఘాటుగా వ్యాఖ్యానించారు. "భారత దేశ వ్యతిరేక ముఠాల్లోని హీరోలు ఎప్పటికీ భారతదేశానికి హీరోలు కాలేరు. ప్రజాస్వామ్యం, దేశ యువతపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ప్రపంచంలోని చాలా దేశాలు ప్రస్తుతం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం నిలకడగా ఉంది" అని కిరెన్ రిజిజు పోస్టు చేశారు.

# మీ వీసా విధానంతో మాకు తీవ్ర నష్టం

## అమెరికా వీసా సంస్కరణలపై రుబియోతో విదేశాంగ మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ:** అమెరికా తన వీసా విధానంలో తీసుకొచ్చిన మార్పులతో భారతీయులు తీవ్రంగా నష్టపోతున్నారని విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. గ్రీన్‌కార్డులు, హెచ్1బీ వీసాల జారీలో మార్పులు అమెరికాలో స్థిరపడాలనుకునే భారతీయులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. భారత పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో జైశంకర్ ఆదివారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇద్దరు మంత్రులు సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. అమెరికా తన వీసా విధానాన్ని పునఃపరిశీలించాలని కోరారు. అయితే, ఆ మార్పులు తమ వలస విధానంలో చేపట్టిన సంస్కరణల్లో భాగమని, ఏ ఒక్క దేశాన్ని ఉద్దేశించి చేసినవి కాదని రుబియో తెలిపారు. ఇంధనం, ద్వైపాక్షిక వాణిజ్యం పెంపు, వ్యూహాత్మక సాంకేతికతలు, అరుదైన ఖనిజాలు, రక్షణ, ప్రజా సంబంధాలు తదితర అంశాలపై తాము చర్చించినట్లు ఇద్దరు నేతలు వెల్లడించారు. అంతర్జాతీయ శాంతి సుస్థిరతలపై భారత్ అనుసరిస్తున్న ఐదు అంశాల సూత్రాన్ని జైశంకర్ వివరించారు. చర్చల ద్వారా వివాదాల పరిష్కారం, ఆంక్షలు లేని సముద్ర ఆధారిత వాణిజ్యం, అంతర్జాతీయ చట్టాలను గౌరవించటం, మార్కెట్లను, అరుదైన వనరులను ఆయుధంగా వాడటాన్ని నిరోధించటం, ప్రపంచ సప్లైచైన్‌కు నమ్మకమైన భాగస్వామ్యాలు అనేవిభారత విదేశాంగ విధాన మూల సూత్రమని తెలిపారు. కాగా, రుబియో భారత పర్యటన మోదీ ప్రభుత్వ దౌత్య విజయమని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు.

### త్వరలోనే ట్రేడ్ డీల్: రుబియో

భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి తుది రూపు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో తెలిపారు. ఇందులో భాగంగా త్వరలోనే తమ ప్రతినిధి బృందం చర్చల కోసం ఢిల్లీకి వస్తుందని చెప్పారు. భారత ప్రతినిధి బృందం ప్రస్తుతం అమెరికాలోనే ఉందని వెల్లడించారు. రెండుదేశాలకు ప్రయోజనకరమైన, సుస్థిరమైన వాణిజ్య ఒప్పందాన్ని త్వరలోనే ఖరారు చేసుకుంటామని ఆశాభావం వ్యక్తంచేశారు. తమ వాణిజ్య విధానాన్ని పూర్తిగా సంస్కరిస్తున్నామని.. అందులో భాగంగానే భారత వస్తువులపై అదనపు సుంకాలు విధించామే తప్ప.. కక్షపూరితంగా కాదని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భారత ప్రధాని స్వయంగా మాట్లాడకపోవటం వల్లనే వాణిజ్య ఒప్పందం ఆగిపోయిందన్న వాదనను ఆయన ఖండించారు. అమెరికాలో భారతీయులపై జాతి వివక్ష దాడులు పెరిగిపోవటంపై రుబియో స్పందించారు. ప్రతిదేశంలోనూ మూర్ఖులు ఉంటారని, అలాగే తమ దేశంలోనూ కొందరు మూర్ఖులు ఉన్నారని తెలిపారు. భారతీయులపై జాతివివక్ష చూపేవారిని కఠినంగా శిక్షిస్తున్నట్లు చెప్పారు.

### ఇండియా ఏం కోరినా ఇస్తాం: ట్రంప్

తన చర్యలు, మాటలతో అందరినీ ఆశ్చర్యపరిచే అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఆదివారం కూడా అలాంట పనే చేశారు. ఢిల్లీలో మార్కో రుబియో నేతృత్వంలో అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించారు. రుబియోతోపాటు భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్ వేదికపై ఉండగా.. ఊహించని విధంగా గోర్‌కు ట్రంప్ ఫోన్ చేశారు. ఆయన మాటలను లైవ్‌లో ప్రసారం చేశారు. 'ప్రధాని మోదీ అంటే నాకు ఎంతో ఇష్టం. ఆయన నా స్నేహితుడు. నాపైనా, మనదేశంపైనా భారత్ 100 శాతం నమ్మకం పెట్టుకోవచ్చు. వారికి ఏదైనా సహాయం కావాలంటే ఎవరికి ఫోన్ చేయాలో తెలుసు. వాళ్లు ఇక్కడికే (ట్రంప్‌కు) ఫోన్ చేస్తారు. మనం చాలాబాగా పనిచేస్తాం. రికార్డులు సృష్టిస్తాం. మనది రికార్డ్ ఎకానమీ. రికార్డ్ స్టాక్ మార్కెట్. భారత్‌కు ఏం కావాలన్నా.. (మననుంచి) వాళ్లు పొందలరు' అని ట్రంప్ పేర్కొన్నారు.

# వైట్‌హౌస్ సమీపంలో కాల్పుల కలకలం

## కాల్పులకు తెగబడిన దుండగుడిపై భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు.. తీవ్రగాయాలతో ఆస్పత్రిలో మృతి

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం సమీపంలో కాల్పుల కలకలం చోటు చేసుకుంది. సీక్రెట్ సర్వీస్ చెక్ పాయింట్ వద్దకుబ్యాగులో తుపాకీతో దూసుకొచ్చిన ఓ దుండగుడు భద్రతా సిబ్బందిపై కాల్పులకు తెగబడ్డాడు. దీంతో అప్రమత్తమైన వారు ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఘటనలో దుండగుడికి తీవ్ర గాయాలవ్వగా.. ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. శనివారం సాయంత్రం వైట్‌హౌస్ సమీపంలోని 17వ వీధి పెన్సిల్వేనియా ఎవెన్యూ వద్ద ఈ కాల్పుల ఘటన చోటు చేసుకుంది. దాదాపు 30 రౌండ్ల కాల్పులు జరగ్గా.. నిందితుడితో పాటు మరో ఇద్దరు కూడా కాల్పుల్లో గాయపడ్డారు. అక్కడి జర్నలిస్టులను వైట్‌హౌస్‌లోని ప్రెస్ బ్రీఫింగ్ రూమ్‌లోకి భద్రతా దళాలు తరలించాయి. కాల్పుల సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోనే ఉన్నారు. కాల్పుల శబ్దం వినపడటంతోనే వైట్‌హౌస్ పరిసరాలన్నీ కాసేపు లాక్‌డౌన్‌లోకి వెళ్లాయి. పోలీసులు, భద్రతా దళాలు వైట్‌హౌస్ వద్ద భారీగా మోహరించాయి. ఇక నిందితుడిని 21 ఏళ్ల నసీర్ బెస్ట్‌గా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. గతేడాది జూలైలోనూ అతడు వైట్‌హౌస్ లోపలికి చొరబడేందుకు యత్నించినట్లు తెలిసింది. కాగా, ట్రంప్ సమీప పరిసరాల్లో కాల్పులు జరగడం గత నెల రోజుల్లో ఇది మూడోసారి కావడం గమనార్హం.

# ఏడాదిలోపు మోదీ సర్కార్ పతనం!

- విధాన వైఫల్యం వల్లే ఆర్థిక సంక్షోభం
- నీట్ పరీక్ష లీకేజీపై విద్యామంత్రి రాజీనామా చేసేవరకు విశ్రమించం
- మైనారిటీల ముసుగులో కాదు.. ముస్లిం సమస్యలపై నేరుగా పోరాడండి
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో జూన్ 6న మైనారిటీ, ఎస్సీల ఉమ్మడి సదస్సు
- భవిష్యత్‌లో హిందూ-ముస్లిం రాజకీయాలు ఉండవు
- అసమానతలే జాతీయ సమస్యగా మారతాయ్: కాంగ్రెస్ నేత రాహుల్
- బీజేపీ ఆగ్రహం.. విదేశీ శక్తులతో కలిసి కుట్ర చేస్తున్నారని ధ్వజం



**న్యూఢిల్లీ:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇంకో ఏడాది కంటే మనుగడ సాగించజాలదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో ఆర్థిక సంక్షోభానికి దాని విధాన వైఫల్యమే కారణమన్నారు. నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు కాంగ్రెస్ విశ్రమించదని స్పష్టంచేశారు. ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ మైనారిటీ విభాగం సలహామండలి సమావేశంలో రాహుల్ మాట్లాడారు. 'మోదీ ప్రభుత్వం ఏడాదిలో కుప్పకూలుతుంది. దీనికి పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం ఒక కారణం కానుంది. నీట్ పరీక్ష లీకేజీని నిరసిస్తూ దేశంలో యువత రోడ్లెక్కుతుంటే.. మోదీ ఇటలీ వెళ్లి రీల్స్ చేసుకుంటున్నారు. ఈ లీకేజీ లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసింది. పలువురు విద్యార్థులు ప్రాణాలు కూడా కోల్పోయారు. దీనికి మోదీ బాధ్యత వహించలేదు. కనీసం విద్యామంత్రి ప్రధాన్‌ను కూడా తొలగించలేదు. ఈ విషయంలో అసలు స్పందించనేలేదు' అని ఆక్షేపించారు. దేశవ్యాప్తంగా ఈ లీకేజీపై నిరసనలు వ్యక్తమవుతున్నాయంటూ.. హైదరాబాద్‌లో ఎన్ఎస్‌యూఐ నేతృత్వంలో జరిగిన భారీ నిరసన ర్యాలీ వీడియోను రాహుల్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంతవరకూ, నీట్ వంటి ప్రశ్నపత్రాల లీకేజీలను నివారించడానికి ఒక పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసేంత వరకూ విశ్రమించం." అని పేర్కొన్నారు. కాగా.. ముస్లింలకు సంబంధించిన విషయాలను ప్రస్తావించేటప్పుడు.. మైనారిటీలంటూ విశాలమైన 'ముసుగు' వేయనక్కర్లేదని.. నేరుగా, బహిరంగంగా 'ముస్లిం'ల సమస్యలనే చెప్పి పోరాడాలని శనివారంనాటి సలహా కమిటీ భేటీలో రాహుల్ స్పష్టంచేశారు. ముస్లింలు, దళితులు, ఓబీసీలు, ఇతరులకు ఏదైనా అన్యాయం జరిగితే.. బాధిత వర్గం పేరు చెప్పడానికి సందేహించనవసరం లేదని స్పష్టంచేశారు. భవిష్యత్‌లో హిందూ–ముస్లిం రాజకీయాలు ఉండవని, పెరుగుతున్న అసమానతలు, ద్రవ్యోల్బణం ప్రధాన జాతీయ సమస్యగా మారతాయన్నారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల కోసం జూన్ 6న కాంగ్రెస్ మైనారిటీ, ఎస్సీల ఉమ్మడి సదస్సు నిర్వహిస్తుందని వెల్లడించారు. ఆర్థిక సవాళ్ల నుంచి జనం దృష్టి మరల్చేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతపరమైన విభజన తీసుకొస్తున్నాయని ఆరోపించారు. భవిష్యత్‌లో నిజమైన రాజకీయ పోటీ ధనికులు, పేదల మధ్యే ఉంటుందని చెప్పారు.

### ముస్లింలకు చేరువయ్యేందుకే..

ముస్లింలకు చేరువయ్యేందుకే రాహుల్ 'ముస్లిం' సందేశం ఇచ్చారని రాజకీయ వర్గాలు అంటున్నాయి. కేరళలో ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్) మద్దతుతో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే అసోం ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన 19 అసెంబ్లీ స్థానాల్లో 18 మంది ముస్లింలే. ఈ నేపథ్యంలో తన పార్టీపై ముస్లిం ఓటర్లలో విశ్వాసం తిరిగి పాదుగొల్పడం కోసం రాహుల్ తాజా సందేశం ఇచ్చారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే వచ్చేఏడాది కీలక రాష్ట్రాలైన యూపీ, గుజరాత్, పంజాబ్‌తో పాటు ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ముస్లింలు, ఎస్సీలకు దగ్గరయ్యేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మక సమావేశాలు నిర్వహిస్తోందని.. ఒంటరి పోటీలకూ సిద్ధమవుతున్నట్లుగా ఉందంటున్నారు.

### అరాచకాల సృష్టికి రాహుల్ యత్నాలు: బీజేపీ

ఏడాదిలో మోదీ సర్కారు కుప్పకూలుతుందన్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు దేశంలో అరాచకాల సృష్టికి ఆయన ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టింది. విదేశీ శక్తుల ప్రోద్బలంతో మోదీ సర్కారును అస్థిరపరిచేందుకు కుట్రలు పన్నుతున్నారని కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, బీజేపీ నేతలు సుధాంశు త్రివేది, సంబిత్ పాత్రా ఆదివారం విరుచుకుపడ్డారు. ఏఐసీసీ మైనారిటీ విభాగం భేటీలో రాహుల్ వ్యాఖ్యలు 'టూల్‌కిట్ గ్యాంగ్' భారీ కుట్రను బయటపెట్టాయని గోయల్ 'ఎక్స్'లో ధ్వజమెత్తారు. 'ఆయనది మామూలు ప్రకటన కాదు. దేశంలో అరాచకాన్ని వ్యాపింపజేసేందుకు పెద్ద కుట్రగా కనిపిస్తోంది. ప్రత్యక్ష పోరులో బీజేపీని ఓడించలేమని రాహుల్‌కు, ఆయన సహాయకులకు అర్థమైంది. అందుకే దేశవ్యాప్తంగా హింసను ప్రజ్వలింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు' అని ధ్వజమెత్తారు. రాహుల్ మాటల్లో రాజకీయ నిస్పృహ ఉందని.. అంతేగాక దేశాన్ని అస్థిరపరచాలనే ప్రమాదకర మనస్తత్వాన్ని ఆయన బహిరంగంగా చాటుకున్నారని త్రివేది అన్నారు. ఎన్నికల్లో వరుస ఓటములతో కాంగ్రెస్ కుదేలైందని ఎద్దేవా చేశారు.

# మున్ముందు 'వడ్డి'ంపులుంటాయ్




## పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ పెంచే అవకాశాలు రాబోయే ద్రవ్య సమీక్షలపై ఆర్థిక నిపుణుల అంచనాలు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రాబోయే ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో కీలక వడ్డీరేట్లను పెంచే అవకాశాలేజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎక్కువగా ఉన్నాయని మెజారిటీ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే వచ్చే నెల జూన్‌లో జరుగబోయే ద్రవ్య సమీక్షలో మాత్రం వడ్డీరేట్ల పెంపు ఉండకపోవచ్చన్న అంచనాలను వ్యక్తం చేస్తున్నారు. ఈసారికి సెంట్రల్ బ్యాంక్ రెపో రేటును యథాతథంగానే కొనసాగించే వీలుందని అంటున్నారు. ఆ తర్వాత వడ్డింపులేనన్న సంకేతాలనిస్తున్నారు.

### ఇదీ సంగతి..

అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే. దాదాపు 3 నెలలుగా జరుగుతున్న ఈ వార్‌తో గల్ఫ్ దేశాలు అట్టుడుకుతున్నాయి. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విజృంభిస్తున్నాయి. దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో పెరుగుతున్న క్రూడాయిల్ రేట్లు.. భారత్‌లో పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ, వంటగ్యాస్ ధరల్ని పరుగులు పెట్టిస్తున్నాయి. ఫలితంగా అటు రిటైల్, ఇటు హోల్‌సేల్ ద్రవ్యోల్బణ గణాంకాలు పెరిగిపోతున్నాయి. ఏప్రిల్‌లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.48 శాతంగా నమోదవగా, టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 42 నెలల గరిష్ఠాన్ని తాకుతూ ఏకంగా 8.3 శాతంగా రికార్డైంది. ఈ క్రమంలో జూన్ ఆరంభంలో జరిగే ఆర్బీఐ ద్రవ్య సమీక్షపైనే అందరి చూపు నెలకొన్నది.

### 50 పాయింట్లదాకా..

సెప్టెంబర్ లేదా అక్టోబర్ ద్రవ్య సమీక్షల్లో వడ్డీరేట్లు పెరుగుతాయని, 25-50 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటు ఎగబాకుతుందని ఆర్థికవేత్తలు చెప్తున్నారు. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉన్నది. ఇది ప్రామాణిక వడ్డీరేటు. వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే స్వల్పకాలిక రుణాలపై ఆర్బీఐ వసూలు చేసే వడ్డీరేటు. ఇది పెరిగితే బ్యాంకులూ రుణాలపై వడ్డీరేట్లను పెంచేస్తాయి. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత ఇతరత్రా రుణాలు భారంగా మారుతాయి. ఈఎంఐల చెల్లింపులు పెరుగుతాయి. అలాగే పొదుపునకు పెద్దపీట వేసే అవకాశాలూ ఉంటాయి. ఆర్బీఐ రెపో రేటును పెంచినప్పుడు బ్యాంకులు తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై వడ్డీరేట్లను పెంచుతాయి. దీంతో డిపాజిటర్లు తమ సొమ్మును ఆకర్షణీయ వడ్డీ ఆదాయం కోసం ఎఫ్‌డీల్లోకి మార్చేందుకు ఆసక్తి కనబరుస్తారు. కాగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ఇచ్చిన పొదుపు పిలుపు నేపథ్యంలో రెపో రేటు పెంపుతో ఆర్బీఐ ఆ దిశగా అడుగులు పడేలా చేయవచ్చన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

### కీలక రంగాలు కుదేలే..

దేశంలో వ్యాపార, పారిశ్రామిక రంగాలు ఇప్పటికే తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. పడిపోయిన ప్రజల కొనుగోలు శక్తితో మార్కెట్‌లో నీరసం కనిపిస్తున్నది. దీంతో ఉత్పాదకత కూడా మందగించింది. ఈ క్రమంలో ఆర్బీఐ వడ్డీరేట్ల పెంపు అన్ని రకాల రుణ లభ్యతను మరింత కఠినతరం చేయగలదు. ఇది పారిశ్రామికోత్పత్తిని గట్టిగానే దెబ్బతీస్తుందన్న ఆందోళన ఆయా రంగాల వర్గాల నుంచి వ్యక్తమవుతున్నది. కారణాలెన్నో..

మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతల దృష్ట్యా.. భారత ఆర్థిక వ్యవస్థపై అనేక రకాల దుష్ప్రభావాలు పడుతున్నాయని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. పెరుగుతున్న ఇంధన ధరలు, విజృంభిస్తున్న ఆహార ద్రవ్యోల్బణం, డాలర్‌తో పోల్చితే జీవనకాల కనిష్ఠాలకు దిగజారుతున్న రూపాయి మారకం విలువ, ఎగుమతులు పడిపోయి భారంగా మారుతున్న దిగుమతులు, వాణిజ్య లోటు, కరెంట్ ఖాతా లోటు, తయారీ రంగంలో మందగమనం.. ఇలా ఎన్నో ఇబ్బందులు చుట్టుముట్టాయని పేర్కొంటున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో పరుగులు పెడుతున్న క్రూడాయిల్ ధరలకు అనుగుణంగా ఇప్పటికే దేశంలో పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ, వంటగ్యాస్ ధరలు పెరిగిన విషయం తెలిసిందే.

గడిచిన పది రోజుల్లో లీటర్ పెట్రోల్, డీజిల్ రేట్లు రూ.5 చొప్పున, కిలో సీఎన్‌జీ ధర రూ.4 ఎగిసింది. దీంతో పెరిగిన రవాణా ఖర్చులు.. అంతిమంగా అన్ని వస్తూత్పత్తుల ధరల్ని ఎగదోస్తాయని ఆర్థిక విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. దీంతో ధరల అదుపే లక్ష్యంగా ఆర్బీఐ వడ్డీరేట్ల పెంపునకే తొలి ప్రాధాన్యతనిస్తుందని వివరిస్తున్నారు. మే, జూన్, జూలై నెలల్లో రిటైల్, హోల్‌సేల్ ద్రవ్యోల్బణం గణాంకాలు ఇంకా పెరిగే వీలుందని అంటున్నారు. గల్ఫ్ యుద్ధం ప్రభావం ఇప్పట్లో తొలిగేలా లేదని, కాబట్టి మున్ముందు ద్రవ్య సమీక్షల్లో ఆర్బీఐ కీలక వడ్డీరేట్లను పెంచుతుందని స్పష్టం చేస్తున్నారు.



# ఈ భూమి మీద తొలి ట్రిలియనీర్ ఎలాన్ మస్క్..

### ఆయన వాటాదారులకు కూడా భారీ లాభాలు..

ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు ఎవరంటే అందరూ ఠక్కున చెప్పే పేరు ఎలాన్ మస్క్. త్వరలో ఆయన ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా మారే దిశగా దూసుకెళ్తున్నారని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే ఆయన వ్యక్తిగత సంపద లక్ష కోట్ల డాలర్ల (రూ.96 లక్షల కోట్లు)కు చేరుకోనుంది. దీనికి ప్రధాన కారణం ఆయన సంస్థ 'స్పేస్ ఎక్స్' భారీ ఐపీఓకు సిద్ధమవుతుండడం 'స్పేస్ ఎక్స్' ఐపీఓ ద్వారా కంపెనీ విలువ సుమారు 1.75 లక్షల డాలర్ల వరకు చేరే అవకాశం ఉంది. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓలలో ఒకటిగా నిలవొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ 'స్పేస్ ఎక్స్' ఐపీఓ సందర్భంగా 2 లక్షల డాలర్ల మార్కెట్ విలువ పొందితే మస్క్ నికర సంపద 1.1 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుటుంది. ఒకవేళ 1.75 లక్షల కోట్ల డాలర్ల వద్దే ఆగిపోయినా.. టాస్లా, ఇతర సంస్థల్లో ఉన్న వాటాలతో కలిపితే మస్క్ మొత్తం సంపద సులభంగా లక్ష కోట్ల డాలర్లను దాటిపోతుంది. భారీ ఐపీఓతో మస్క్ ఈ భూమ్మీదే తొలి ట్రిలియనీర్‌గా అవతరించనున్నారు . కాగా, ఈ ఐపీఓతో కంపెనీలోనే పలువురు ఉద్యోగులు బిలియనీర్లుగా మారబోతున్నారు. 'స్పేస్ ఎక్స్' అనుకున్న మార్కెట్ విలువను పొందితే.. సంస్థ ప్రెసిడెంట్ గ్విన్ షాట్‌వెల్, సీఎఫ్ఓ బ్రెట్ జాన్సన్, బోర్డు డైరెక్టర్ ల్యూక్ నాసెక్ కూడా బిలియనీర్లు కాబోతున్నారు.

# జువెలరీ విక్రయాలు 13-15 శాతం తగ్గొచ్చు..

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో స్వర్ణాభరణాల రిటైల్ విక్రయాల పరిమాణం వార్షిక ప్రాతిపదికన 13-15 శాతం మేర తగ్గి 620-640 టన్నులకు పరిమితం కావచ్చని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ అంచనా వేసింది. గరిష్ఠ స్థాయి ధరలు, దిగుమతి సుంకం పెంపు ఇందుకు కారణం కానున్నాయని శుక్రవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో బంగారు నగల రిటైల్ విక్రయాల పరిమాణం అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2024-25)తో పోలిస్తే 8 శాతం తగ్గింది. కాగా, 2026-27లో ఆభరణాల రంగ ఆదాయం 20-25 శాతం మేర పెరగవచ్చని, అధిక ధరలు ఇందుకు దోహదపడనున్నాయని నివేదికలో ప్రస్తావించింది. అంతేకాదు, అధిక ధరల కారణంగా జువెలర్స్‌కు నగల నిల్వల నిర్వహణ ఖర్చు, బ్యాంక్ నుంచి రుణాల సమీకరణ కూడా పెరగనుందని క్రిసిల్ అంటోంది. అయినప్పటికీ, ఆదాయం, నగదు లభ్యత పెరుగుదల రుణాలపై ఆధారపడటాన్ని తగ్గించనుందని, తత్ఫలితంగా జువెలరీ కంపెనీల పరపతి రేటింగ్ నిలకడగా కొనసాగవచ్చని పేర్కొంది.

### బంగారం డిమాండ్ 50-60 టన్నుల మేర తగ్గొచ్చు: డబ్ల్యూజీసీ

దిగుమతి సుంకం పెంపు కారణంగా ఈ ఏడాది భారత్‌లో పసిడి గిరాకీ 50-60 టన్నుల మేర తగ్గవచ్చని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) అంచనా వేసింది. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 10ృతక్కువ.


# నీట్‌కు మరోసారి సదవకాశంగా మలుచుకుంటే సత్ఫలితం

నీట్ రద్దయింది. ఆశావహులపై నీళ్ళుజల్లింది. 23 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్రమైన నిరాశ, ఆందోళన, ఆగ్రహం కలిగించింది. అయితే ఈ సంక్షోభాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మొదట మొన్నటి నీట్‌ని ప్రీఫైనల్ అనుకుంటే సగం భారం తగ్గుతుంది. అంతేకాదు, ఇప్పుడు

కలిగిన కష్టాన్ని వ్యక్తిగతంగా తీసుకోవద్దు. నీట్‌కు హాజరైన అందరికీ కలిగిన కష్టం అనుకుంటే అందోళన చాలా వరకు తగ్గుతుంది. ఏం చేయాలన్నది స్ఫురిస్తుంది. నిజానికి ఈ సమయాన్ని స్కోర్ పెంచుకునేందుకు ఉపయోగపడే గోల్డెన్ పీరియడ్‌గా భావించి కసరత్తు ఆరంభించాలి. జూన్ 21న తిరిగి నీట్ నిర్వహించనున్నారు. నెల రోజులకు పైగా సమయం ఉన్న నేపథ్యంలో...

### ఈ ఏడాదికి తోడు గడచిన రెండేళ్ళలో జరిగిన నీట్‌ని విశ్లేషించుకుంటే. ముఖ్యమైనవిగా...

- బోటనీలో జెననెటిక్స్ అండ్ ఎవల్యూషన్, మాలిక్యులర్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటెన్స్, ఎకాలజీ, సెల్ బయాలజీ వంటి చాప్టర్స్
- జువాలజీలో హ్యూమన్ ఫిజియాలజీ, రిప్రొడక్షన్, హెల్త్ అండ్ డిసీజ్, బయోమాలిక్యూల్స్ వంటి చాప్టర్స్
- ఫిజిక్స్‌లో కరెంట్ ఎలక్ట్రిసిటీ, మోడ్రన్ ఫిజిక్స్,
- ఆప్టిక్స్, వేవ్స్, మేగ్నటిజమ్ అండ్ ఈఎంఐ
- కెమిస్ట్రీలో కెమికల్ బాండింగ్, జీఓసీ, హైడ్రోకార్బన్స్, కోఆర్డినేషన్ కాంపౌండ్స్, అల్డిహైడ్స్, కీటోన్స్, ప్రాక్టికల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ
- ఈ సమయంలో ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్ రివిజన్‌పైనే ఫోకస్ పెట్టాలి బయాలజీలో సినానిమ్ టెర్మ్స్, ఫిజిక్స్ అలాగే కెమిస్ట్రీలో ముఖ్యమైన ఫార్ములాలు, రియాక్షన్స్‌ని రివైజ్ చేసుకోవాలి.
- రోజుకు కనీసం ఒక పూర్తి స్థాయి మాక్ టెస్ట్ రాయాలి. ఎర్రర్ నోట్ బుక్ కూడా మెయింటైన్ చేయాలి. మీరు చేస్తున్న తప్పు కాన్సెప్ట్ పరంగానా, కాలిక్యులేషన్ కారణంగానా అన్నది తెలిస్తే సరిదిద్దుకునేందుకు వీలవుతుంది.



- ఈ ఏడాది నీట్ పేపర్‌లో కాలిక్యులేషన్స్ కొంత లెంథీగా ఉన్నాయి. విద్యార్థులను అవి ఇబ్బంది పెట్టాయి. అందుకని ప్రాక్టీసింగ్ సమయంలోనే కాలిక్యులేషన్స్ విషయంలో వేగాన్ని పెంచుకునే ప్రయత్నం చేయాలి.
- కొత్తగా లేదా మీరు అంత స్ట్రాంగ్‌గా లేని చాప్టర్ల జోలికి ఇప్పుడు పోవద్దు. హై వెయిటేజ్ అలాగే మీరు కాన్ఫిడెంట్ అనుకున్న చాప్టర్లను మాత్రమే ఎక్కువగా రివైజ్ చేయాలి.
- కొద్ది రోజుల క్రితం జరిగిన నీట్ కొంత ఈజీగా ఉందన్న వార్తలు వచ్చాయి. అయితే త్వరలో జరగబోయే రీ-నీట్ కొద్దిగా కఠినంగా ఉండవచ్చు. ప్రమాణాలను పెంచే యత్నం చేయవచ్చు. అందుకు తగ్గట్టుగా ప్రిపేర్ కావాలి.
- ప్రీవియస్ ఇయర్స్ ప్రశ్నపత్రాలను తప్పక రివైజ్ చేయండి. స్టేట్‌మెంట్, అసెర్షన్ - రీజనింగ్, మేచింగ్ టైప్ ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. మాక్ టెస్టుల్లో గెస్ వర్క్‌కు అవకాశం ఇవ్వకూడదు.
- సోషల్ మీడియా అదేవిధంగా రూమర్లకు దూరంగా ఉండాలి. కొద్ది రోజుల క్రితం రాసిన నీట్ రద్దయింది. అందుకే దీనిని ఫ్రెష్‌గా ఆలోచించాలి.
- ఈ పరీక్ష రద్దుతో విద్యార్థులే కాదు, వారి తల్లిదండ్రులు కూడా విపరీతమైన మానసిక ఆందోళనకు గురయ్యారన్నది వాస్తవం. రెండేళ్ళ శ్రమ వృథా అయిందన్న ఆవేదన తప్పక ఉంటుంది. అయితే కుటుంబం అంతా ఎమోషనల్ సపోర్ట్ కలిగి ఉండాలి. మీ తప్పేమీ లేదు. అందుకని అతిగా ఎవ్వరూ ఆలోచించవద్దు.
- సరైన నిద్ర, పౌష్టికాహారం, పాజిటివ్ థింకింగ్‌తో ఈ గడువును ఇట్టే అధిగమించాలి. విజయాన్ని అందుకోవడమే ఇప్పుడు మీ లక్ష్యం కావాలి.

# ప్లే ఆఫ్స్‌కు రాజస్థాన్

## ముంబైపై ఘన విజయం

## ఢిల్లీ, పంజాబ్, కోల్‌కతా ఇంటికి ..!

పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ చివరి బెర్తును రాజస్థాన్ రాయల్స్ పట్టేసింది. ఉత్కంఠ పోరులో అదిరే ఆటతో ముంబై ఇండియన్స్‌కు చెక్ పెట్టిన రాజస్థాన్.. ఎలిమినేటర్ ఆడాలనుకున్న పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఇంటికి పంపింది. వాంఖడేలో జోఫ్రా ఆర్చర్(32, 3-17) ఆల్‌రౌండ్ షోతో ముంబై బెంబేలెత్తిపోయింది. భారీ ఛేదనలో సూర్యకుమార్ యాదవ్(60) ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్‌ను రాజస్థాన్ ఢీకొట్టనుంది.

చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ సమిష్టి కృషితో ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. గెలిస్తేనే ఎలిమినేటర్ బెర్తు దక్కనున్న వేళ జోఫ్రా ఆర్చర్(32, 3-17) చెలరేగాడు.వాంఖడేలో ముంబై ఇండియన్స్ బౌలర్లను బాదేసిన అర్చర్.. అనంతరం బంతితోనూ ఆ జట్టు బ్యాటర్లను వణికించాడు. బ్రిజేష్ శర్మ(2-26), బర్గర్(2-43) కీలక వికెట్లు తీసి సహకరించగా 8వ విజయం.. 16 పాయింట్లతో రాజస్థాన్ ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకుంది.

రాజస్థాన్‌కు భారీ స్కోర్ సమర్పించుకున్న ముంబై బ్యాటింగ్‌లో తడబడుతోంది. తొలి ఓవర్లోనే రోహిత్ శర్మ(0)ను డకౌట్ చేసిన ఆర్చర్(3-17) తర్వాతి ఓవర్లో నమన్ ధీర్(6)ను బౌల్డ్ చేసి రెండో వికెట్ అందించాడు. బర్గర్ ఓవర్లో రికెల్టన్(12)కవర్స్‌లో వైభవ్ చేతికి చిక్కగా. 24 వద్ద మూడో వికెట్ పడింది. అనంతరం సూర్యకుమార్ యాదవ్(60)తో కలిసి తిలక్ వర్మ(3)



ఇన్నింగ్స్ నిర్మించాలనుకున్నాడు. కానీ, బ్రిజేష్ అతడిని బౌల్డ్ చేయడంతో పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయింది ముంబై.

విల్ జాక్స్(33) జతగా సూర్య ధనాధన్ ఆడగా ముంబై స్కోర్ వంద దాటింది. అయితే.. ఐదో వికెట్‌కు 63 రన్స్ జోడించిన జాక్స్‌ను యశ్ రాజ్ ఔట్ చేయగా వస్తూనే హార్దిక్ పాండ్యా(34) రెండు సిక్సర్లతో తన ఉద్దేశాన్ని చాటాడు. గెలిపించే బాధ్య తీసుకున్న ఈ ఇద్దరూ రాజస్థాన్‌ను భయపెట్టారు. రెండో స్పెల్‌లో ఆర్చర్ మరో వికెట్ అందిస్తూ పాండ్యాను వెనక్కి పంపాడు. కార్బిన్ బాష్(2) విఫలమవ్వగా.. శార్దూల్ ఠాకూర్(10 నాటౌట్) అండతో ముంబైని గట్టెక్కించాలనుకున్న సూర్యను బర్గర్ రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ పంపడంతో రాజస్థాన్ విజయం ఖాయమైంది. చివరి ఓవర్లో 37 రన్స్ అవసరమవ్వగా శనక ఆరు పరుగులే ఇచ్చాడు. దాంతో.. 30 పరుగులతో గెలుపొందిన రాజస్థాన్ నాలుగో స్థానంతో మురిసింది.

### రాణించిన జురెల్, ఆర్చర్

ప్లే ఆఫ్స్ బెర్తును నిర్ణయించే మ్యాచ్‌లో రాజస్థాన్ బ్యాటర్లు టాపార్డర్ బ్యాటర్లు తేలిపోయారు. పవర్ ప్లేలోనే ముంబై ఇండియన్స్ బౌలర్లు మూడువికెట్లతో దెబ్బతీయగా.. మిడిలార్డర్ సైతం తడబడింది. దంచికొట్టే ఓపెనర్లు స్వల్ప స్కోర్‌కే ఔటైన వేళ ధ్రువ్ జురెల్(38), ఆర్చర్(32)లు ఆపద్బాంధవులయ్యారు. కానీ, డెత్ ఓవర్లలో శార్దూల్(2-41) విజృంభించినా జడేజా(19 నాటౌట్) మెరుపులతో రాజస్థాన్ రెండొందలు కొట్టింది.

# చివరి పంచ్ ఢిల్లీదే..!

## మెరిసిన రాహుల్, కుల్దీప్..





చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను చిత్తుగా ఓడించి విజయంతో టోర్నీని ముగించింది. రాహుల్(60) అర్ధ శతకంతో భారీ స్కోర్ కొట్టిన ఢిల్లీ.. కుల్దీప్ యాదవ్(3-29), ఎంగిడి(3-27) జోరుతో కోల్‌కతాను కట్టి చేసింది. రహానే(63) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడినా సహకరించేవాళ్లు కరువయ్యారు. పావెల్() రనౌటవ్వడంతో ఢిల్లీ 40 పరుగుల తేడాతో గెలుపొందింది.

పంతొమ్మిదో సీజన్ లీగ్ దశ ముగిసింది. డబుల్ హెడర్ రెండో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జయభేరి మోగించడంతో కోల్‌కతా నైట్ రైడర్స్ నిరాశగా ఇంటిదారి పట్టింది. డేంజరస్ ఓపెనర్ ఫిన్ అలెన్(20)ను బౌల్డ్ చేసిన ఎంగిడి(3-27) కోల్‌కతాకు షాకిచ్చాడు. కెప్టెన్ అజింక్యా రహానే(63)తో కలిసి దంచేసిన మనీశ్ పాండే(25)ను ఎంగిడి వెనక్కి పంపాడు. సిక్సర్ బాదిన పాండే బౌండరీకి యత్నించి స్టార్క్ డైవింగ్ క్యాచ్‌కు డగౌట్ చేరాడు. అర్ధ శతకం పూర్తి చేసుకున్న రహానే.. పావెల్(29)తో కలిసి గెలుపు బాధ్యత తీసుకున్నాడు. కానీ, కుల్దీప్ యాదవ్(3-29) ఒకే ఓవర్లో రహానే, రింకూ సింగ్(0)లను ఔట్ చేసి కోల్‌కతాను కష్టాల్లోకి నెట్టాడు. అనంతరం.. పావెల్ దూకుడుగా ఆడినా రజ్వీ విసిరిన త్రోకు రనౌటవ్వగా ఢిల్లీ విజయం ఖాయమైంది. స్టార్క్() ఓవర్లో అనుకుల్ రాయ్, కార్తిక్ త్యాగీలు ఔటయ్యారు. చక్రవర్తిని ఎంగిడి చివరి వికెట్‌గా వెనక్కి పంపగా కోల్‌కతా పరిమితమైంది.

### రాహుల్ అర్ధ శతకం

ప్లే ఆఫ్స్ బెర్తు చేజారిన వేళ ఢిల్లీ క్యాపిటల్స్ ఈడెన్ గార్డెన్స్‌లో భారీ స్కోర్ కొట్టింది. కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లను ఉతికేస్తూ ఓపెనర్ కేఎల్ రాహుల్(60) అర్ధ శతకంతో చెలరేగగా.. అక్షర్ పటేల్(39) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. కోల్‌కతా బౌలర్లపై విరుచుకుపడిన ఈ ద్వయం వెనుదిరిగినా.. డెత్ ఓవర్లలో మిల్లర్(28), అశుతోష్ శర్మ(18 నాటౌట్)లు దంచేశారు. ఫలితంగా కోల్‌కతాకు 204 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది.

# భారత అథ్లెటిక్స్ చరిత్రలో సరికొత్త సంచలనం..

### జాతీయ రికార్డు బద్దలు..!




భారత అథ్లెటిక్స్ లో సరికొత్త సంచలనం నమోదైంది. పరుగు పందెంలో మనకు ఒక ఉసేన్ బోల్ట్ దొరికేశాడంటూ క్రీడాభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. రాంచీ వేదికగా జరుగుతున్న 2026 అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్‌లో పంజాబ్ కు చెందిన 25 ఏళ్ల గురిందర్‌వీర్ చిరుతలా పరుగెత్తాడు. పురుషుల 100 మీటర్ల ఫైనల్‌లో కేవలం 10.09 సెకన్లలోనే గమ్యాన్ని చేరి స్వర్ణ పతకాన్ని ముద్దాడాడు. సరికొత్త జాతీయ రికార్డును నెలకొల్పాడు. తన అద్భుత ప్రదర్శనతో గురిందర్‌వీర్ భారత అథ్లెటిక్స్ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించాడు. 10.10 సెకన్ల కంటే తక్కువ సమయంలో 100 మీటర్ల దూరాన్ని పూర్తి చేసిన మొట్టమొదటి భారత అథ్లెట్‌గా నిలిచాడు. రిలయన్స్ ఫౌండేషన్ తరఫున బరిలోకి దిగిన గురిందర్‌వీర్, పాత జాతీయ రికార్డును బద్దలు కొట్టి ఈ చారిత్రక విజయాన్ని అందుకున్నాడు.

అద్భుతమైన టైమింగ్‌తో గురిందర్‌వీర్ 2026 కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత కూడా సాధించాడు. కామన్వెల్త్ క్రీడల అర్హత మార్క్ 10.16 సెకన్లు కాగా.. దాన్ని వీర్ సునాయాసంగా అధిగమించాడు. ఇదే ఈవెంట్‌లో అనిమేష్ కుజూర్ (10.20 సెకన్లు) రజతం గెలుచుకోగా, ప్రణవ్ గురవ్ (10.29 సెకన్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. కాగా గురిందర్‌వీర్ విజయం భారత స్ప్రింటింగ్‌లో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోనుంది.

# భారత్ మ్యాచ్‌కు ప్రాధాన్యం ఇవ్వం..

ఐసీసీ టోర్నమెంట్ ఏదైనా భారత్ మ్యాచ్‌కు ఉండే క్రేజే వేరు. పురుషుల జట్టైనా, మహిళల టీమైనా నువ్వానేనా అంటూ తలపడడం అభిమానులకు భలే కిక్కిస్తుంది. ఈసారి మహిళల టీ20 ప్రపంచకప్‌లో మరోసారి దాయాదులు తాడోపేడో తేల్చుకోనున్నాయి. లీగ్ దశలో చిరకాల మ్యాచ్ గురించి పాక్ కెప్టెన్ ఫాతిమా సనా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. అందరూ ఊహిస్తున్నట్టు ఇండియాతో మ్యాచ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వబోవని ఫాతిమా పేర్కొంది.

టీ20 ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా పాకిస్థాన్ జట్టు లాహోర్‌లో శిక్షణ శిబిరంలో బిజీగా ఉంది. జూన్ 14న ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌తో జరుగనున్న మ్యాచ్‌కు ఎలా సన్నద్ధమవుతున్నారు? అని కెప్టెన్ సనా ఫాతిమాను మీడియా ప్రశ్నించగా ఆమె 'అదేం లేదు.. ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలనుకోవడం లేదు' అని చెప్పింది. మేము ప్రపంచకప్ కోసం బాగా సన్నద్ధమయ్యాం.

వరల్డ్‌కప్‌లో ప్రతి మ్యాచ్ ముఖ్యమే. టీ20



ఫార్మాట్లో ఎప్పుడు ఏదైనా జరగొచ్చు. అందుకని మేము ఒక మ్యాచ్ కోసం ప్రత్యేకంగా సిద్ధమవ్వడం లేదు. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ అందరికీ తెలిసిందే. దేవుడి ఆశీర్వాదంతో మేము మెరుగైన ప్రదర్శన చేయాలనుకుంటున్నాం అని ఫాతిమా వెల్లడించింది.

### భారత్ 13సార్లు

ఇటీవలే స్వదేశంలో జింబాబ్వేను వైట్‌వాష్ చేసిన పాకిస్థాన్ ప్రపంచకప్ పోటీలకు ఆత్మవిశ్వాసంతో రానుంది. కెప్టెన్ ఫాతిమా 15 బంతుల్లోనే వేగవంతమైన అర్ధ శతకతో రికార్డు నెలకొల్పింది కూడా. వరల్డ్‌కప్ ముందు ఐర్లాండ్, వెస్టిండీస్‌తో పాక్ ముక్కోణపు సిరీస్ ఆడనుంది. జూన్ 12 నుంచి మొదలయ్యే పొట్టి కప్‌లో భారత్, పాక్ గ్రూప్ ఏలో ఉన్నాయి. లీగ్ దశలో ఇరజట్లు జూన్ 14న ఎడ్జ్‌బాస్టన్‌లో తలపడనున్నాయి. రికార్డు గమనిస్తే.. టీ20 వరల్డ్‌కప్‌లో పాక్‌పై టీమిండియాదే పైచేయి. ఇప్పటివరకూ 16 మ్యాచుల్లో భారత్ 13సార్లు దాయాదిని చిత్తు చేసింది.

# వారణాసి... హైదరాబాదులో మహేష్ బాబుపై పాట చిత్రీకరణ!

సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న వారణాసి చిత్రంపై ఓ ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కీలకమైన పాటను హైదరాబాద్‌లోని కాటేదాన్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఇది కేవలం ఓ సాధారణ డ్యాన్స్ నంబర్ కాదని, కథను ముందుకు నడిపించే ముఖ్యమైన పాట అని తెలుస్తోంది. ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్ షూటింగ్‌ను ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని రాజమౌళి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పలు ప్రధాన షెడ్యూల్స్‌ను పూర్తి చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో నీటి కొరత కారణంగా, ముందుగా ప్లాన్ చేసుకున్న ఓ అండర్‌వాటర్ సీక్వెన్స్‌ను కూడా విజయవంతంగా చిత్రీకరించారు. ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా మందాకిని పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర' అనే సాహస యాత్రికుడిగా కనిపించనుండగా, ఓ ప్రత్యేక ఘట్టంలో శ్రీరాముడి పాత్రలోనూ కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది.







# బుమ్రాకు క్షమాపణలు చెప్పిన రామ్ చరణ్

ప్రముఖ నటుడు రామ్ చరణ్.. భారత క్రికెట్ జట్టు పేస్ దిగ్గజం జస్‌ప్రీత్ బుమ్రాకు బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. ఓ కార్యక్రమంలో బుమ్రాను పొరపాటున ఫుట్‌బాల్ ఆటగాడిగా సంబోధించడంతో ఆ తప్పును సరిదిద్దుకుంటూ ఆదివారం తన 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. "అయ్యో.. నేను కొన్నిసార్లు పేర్ల విషయంలో నిజంగా చాలా మతిమరుపుతో ఉంటాను. జస్‌ప్రీత్ బుమ్రా జీ.. నన్ను క్షమించండి. ఆ జనసందోహం, ఉత్సాహం మధ్యలో అది మానవ సహజంగా జరిగిన పొరపాటు మాత్రమే. నేను మిమ్మల్ని ఎంతో గౌరవిస్తాను. మీ ఆటతీరుకు నేను పెద్ద అభిమానిని. మీరు బ్యాటర్లను నిలకడగా ఒత్తిడికి గురిచేస్తూ ప్రతి భారతీయుడు గర్వపడేలా చేస్తున్నారు" అని చరణ్ తన పోస్టులో పేర్కొన్నారు. గతంలో ఓ ఈవెంట్‌లో భారత క్రికెటర్ల గురించి అడిగినప్పుడు రామ్ చరణ్ మాట్లాడుతూ.. "బుమ్రాకు నేను పెద్ద అభిమానిని. నాకు ఫుట్‌బాల్ అంటే చాలా ఇష్టం. మీరు దానిని మరింత ముందుకు తీసుకెళ్తున్నారు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల వల్లే తాజా గందరగోళం తలెత్తింది. ఇక సినిమాల విషయానికొస్తే, రామ్ చరణ్ ప్రస్తుతం 'పెద్ది' అనే భారీ చిత్రంలో నటిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్, దివ్యేందు, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, విజయ్ సేతుపతి వంటి ప్రముఖ నటులు నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం 2026, జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# బాలయ్య డ్యూయల్ షేడ్స్



టాలీవుడ్‌లో మాస్ సినిమాలకు కొత్త నిర్వచనం ఇచ్చిన నటసింహం నందమూరి బాలకృష్ణ, కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌కు తనదైన ముద్ర వేసుకున్న డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా సినిమా ఇప్పుడు ఇండస్ట్రీలో భారీ చర్చకు దారి తీస్తోంది. ఇప్పటికే రిలీజైన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌తోనే ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తిని రేకెత్తించగా, తాజాగా బయటకు వస్తున్న కథా విశేషాలు అంచనాలను మరింత పెంచుతున్నా యి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలయ్య పాత్రను రెండు భిన్నమైన షేడ్స్‌లో డిజైన్ చేశారన్న టాక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సమాచారం ప్రకారం సినిమాలో ఒకటి ప్రస్తుత కాలానికి చెందిన పవర్‌ఫుల్ పాత్ర కాగా, మరొకటి భారీ ఫ్లాష్ బ్యాక్‌లో కనిపించే రాజసంగా ఉండే యువరాజు లేదా రాజు తరహా పాత్ర అని తెలుస్తోంది. ముఖ్యంగా సెకండ్ హాఫ్‌లో వచ్చే ఈ ఫ్లాష్ బ్యాక్ మొత్తం సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందట. గోపీచంద్ మలినేని ఈ ఫ్లాష్ బ్యాక్‌ను కేవలం యాక్షన్ కోసమే కాకుండా, బలమైన ఎమోషన్స్ తో నింపుతున్నారని సమాచారం. రాజ్యం, కుటుంబం, త్యాగం, ప్రతీకారం వంటి ఎలిమెంట్స్‌తో ఈ ట్రాక్ సాగుతుందని, ఇందులో బాలయ్య నటన మరోసారి ఫ్యాన్స్ కు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌లో బాలయ్య లుక్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని తెలుస్తోంది. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో కనిపించిన రాజసం, యుద్ధ నేపథ్యం, సామ్రాజ్య వాతావరణం చూస్తుంటే, ఈ సినిమా సాధారణ కమర్షియల్ యాక్షన్ డ్రామా కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారీ సెట్స్, వార్ ఎపిసోడ్స్, పీరియాడిక్ టచ్‌తో ఈ సినిమాను డైరెక్టర్ గ్రాండ్ విజువల్ స్పెక్టకల్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్లు టాక్. ముఖ్యంగా సినిమాలో ఈ డ్యూయల్ ఎమోషనల్ ట్రాక్ సినిమాకు ప్రధాన బలమవుతుందని అంటున్నారు.

# విజయ్ దేవరకొండ సరసన ప్రీతి ముకుందన్ స్పెషల్ సాంగ్

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రౌడీ జనార్ధన' గురించి ఒక క్రేజీ అప్‌డేట్ ఫిలిం నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్ కోసం రవి కిరణ్ కోలా అదిరిపోయే సిచువేషన్‌ను డిజైన్ చేశారట. ఈ మాస్ నంబర్ కోసం 'కన్నప్ప' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న బ్యూటీ ప్రీతి ముకుందన్‌ను తీసుకోవాలని చిత్ర యూనిట్ గట్టిగా ప్లాన్ చేస్తోంది. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఆమెతో చర్చలు కూడా సాగుతున్నాయని, అంతా ఓకే అయితే విజయ్ దేవరకొండతో కలిసి ప్రీతి ముకుందన్ స్టెప్పులేయడం ఖాయమని తెలుస్తోంది.ఈ సినిమాకు సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్ ఏంటంటే.. సీనియర్ యాక్టర్, యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఆయన క్యారెక్టర్ చాలా వైవిధ్యంగా ఉండటమే కాకుండా, లుక్ పరంగా కూడా మునుపెన్నడూ చూడని విధంగా చాలా భిన్నంగా ఉండబోతోందని టాక్. కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం టాలీవుడ్‌లో భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది. ఒకవైపు 'రణబాలి' సినిమా చేస్తూనే, మరోవైపు ఈ 'రౌడీ జనార్ధన'తో బాక్సాఫీస్ వద్ద పక్కా కమర్షియల్ హిట్ కొట్టాలని విజయ్ దేవరకొండ గట్టి పట్టుదలతో ఉన్నాడు.

# జిల్లాలో 75 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి

## మరో పది రోజుల్లో ప్రక్రియ పూర్తిచేస్తాం: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, మే 25: జిల్లాలో ఇప్పటివరకు సుమారు 75 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యిందని, మిగిలిన కొనుగోళ్లను మరో పది రోజుల్లో పూర్తిచేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నేపథ్యంలో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 68 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని వెల్లడించారు. మొత్తం 2,29,514 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ ధాన్యం విలువ రూ.544.74 కోట్లు కాగా, రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.407.21 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన చెల్లింపులు కూడా ఒకటి రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. గత నాలుగు రోజుల్లోనే 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్--అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని పేర్కొన్నారు. మరో పది రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రోజువారీ లక్ష్యాలతో కొనుగోళ్లు పూర్తి చేస్తామని చెప్పారు. రైతులకు తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.

# మరో పది రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి

## జిల్లాల కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం




కరీంనగర్, మే 25: రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్ నుంచి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక అంశాలపై సమీక్ష చేపట్టారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నాయని, రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.45 వేల కోట్లకు పైగా జమ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన 16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రాష్ట్రంలో గన్ని బ్యాగుల కొరత లేదని, 21 కోట్ల గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గోదాములు, లారీలు, హమాలీల కొరత ఉన్న ప్రాంతాల్లో వెంటనే సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం మహిళా సంక్షేమ వారోత్సవాల నిర్వహణపై మంత్రి సీతక్క, ఉన్నతాధికారులు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 25 నుంచి నిర్వహించే కార్యక్రమాలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ మహిళా సంక్షేమ వారోత్సవాలను జిల్లాలో అద్భుతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ, డీఆర్‌డీఓ, మెప్మా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.




# జీనియస్ ర్యాంకింగ్ చదరంగం పోటీలకు విశేష స్పందన



కరీంనగర్, మే 25: కరీంనగర్‌లోని శ్రీ చైతన్య యూత్ క్లబ్, భగత్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన జీనియస్ ర్యాంకింగ్ చదరంగం పోటీలకు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 125 మంది చదరంగం క్రీడాకారులు తమ మేధాశక్తిని ప్రదర్శించారు. ఈ పోటీలను చెన్నూరు (రూరల్) సీఐ ఆర్. కృష్ణ, జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య కలిసి తొలి ఎత్తు వేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీఐ ఆర్. కృష్ణ మాట్లాడుతూ చదరంగం ఆట పిల్లల్లో మేధాశక్తి, ఏకాగ్రతను పెంపొందిస్తుందని అన్నారు. జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య మాట్లాడుతూ చిన్నారుల ప్రతిభను వెలికితీయడానికే ఈ ర్యాంకింగ్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. లక్ష్మీనారాయణ సోలార్ ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో టోర్నమెంట్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్, సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్, లక్ష్మీనారాయణ సోలార్ ఎంటర్‌ప్రైజెస్ మేనేజర్ శ్రీనివాస్, ఎండీ కుమారస్వామి, చైతన్య యూత్ క్లబ్ సభ్యులు పండుగ నాగరాజు, కరీంనగర్ జిల్లా డెమొక్రటిక్ డెవలప్‌మెంట్ కార్యదర్శులు కంకటి సృజన్ కుమార్, తాటిపల్లి సతీష్ బాబు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు. పోటీల నిర్వహణలో చీఫ్ ఆర్బిటర్ తరుణ్‌తో పాటు ఆర్బిటర్లు అరుణ్, అభిరామ్, నితిన్, రేవిక్, స్వాతి, ప్రభుదేవా, వరుణ్, విశాల్, అజయ్ సేవలందించారు. క్రీడాకారుల తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# సూపర్ ఫైటర్ కప్ కరాటే పోటీల ప్రారంభం

## 10 జిల్లాల క్రీడాకారులతో కరీంనగర్‌లో ఉత్సాహంగా పోటీలు



కరీంనగర్, మే 25: కరీంనగర్ నగరంలో నిర్వహిస్తున్న 10 జిల్లాల స్థాయి "సూపర్ ఫైటర్ కప్" కరాటే పోటీలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులకు ఆత్మరక్షణతో పాటు మానసిక ధైర్యాన్ని కూడా అందిస్తాయని పేర్కొన్నారు. యువత క్రీడల పట్ల మరింత ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారులు, యువ క్రీడాకారులను అభినందిస్తూ విజేతలకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కరీంనగర్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సురభి వేణుగోపాల్, సురభి అన్వేష్, కార్పొరేటర్ చంద్ర, క్రీడాకారులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.


# మీడియా ప్రజాపక్షంగా ఉండాలి

## సంచలనాలకు దూరంగా సత్యానికి దగ్గరగా జర్నలిజం సాగాలి: వెంకయ్య నాయుడు




**హైదరాబాద్, మే 24:** మీడియా ఎల్లప్పుడూ ప్రజాపక్షంగా ఉండాలని, సంచలనాలకు దూరంగా సత్యానికి దగ్గరగా జర్నలిజం సాగాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ లో నవ సాహితీ ఇంటర్నేషనల్, వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన గోరా శాస్త్రి స్మారక ఉత్తమ జర్నలిస్టు పురస్కార ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ జర్నలిస్ట్ జి వల్లీశ్వర్ కు గోరా శాస్త్రి ఉత్తమ జర్నలిస్టు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ మీడియా ప్రజాస్వామ్య వ్యవస్థకు నాలుగో మూలస్తంభమని పేర్కొన్నారు. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు తమ పరిధిని దాటినప్పుడు వాటిని హెచ్చరించి సరైన దారిలో నడిపించే బాధ్యత మీడియాపై ఉందన్నారు. "బ్రేకింగ్ న్యూస్ పేరుతో న్యూస్‌ను బ్రేక్ చేస్తున్నారు" అంటూ ప్రస్తుత మీడియా ధోరణిపై వ్యాఖ్యానించారు. ప్రపంచం ప్రస్తుతం యుద్ధాలు, ఘర్షణలు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, వాటి ప్రభావం ప్రజల జీవితాలపై పడే అవకాశముందని తెలిపారు. ఇటువంటి సందర్భాల్లో ప్రజలకు సరైన అవగాహన కల్పించి సమస్యల తీవ్రతను తగ్గించే బాధ్యత మీడియాదేనని పేర్కొన్నారు. "అగ్గి రాజుకున్నప్పుడు ఆర్పడానికి ప్రయత్నించాలి కానీ, దానికి ఆజ్యం పోయకూడదు" అని సూచించారు. తెలుగు పత్రికా రంగంలో గోరా శాస్త్రి సేవలను కొనియాడిన వెంకయ్య నాయుడు, నేటి తరం జర్నలిస్టులు ఆయన రచనలను చదవాలని సూచించారు. నిజాయితీ, నిష్పాక్షికత, వ్యంగ్యంతో కూడిన సంపాదకీయాలు గోరా శాస్త్రిని ప్రత్యేక స్థానంలో నిలిపాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు గోవిందరాజు చక్రధర్, ప్రముఖ సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ, వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రహ్మణేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పదంగా యువకుడి మృతి



తిమ్మాపూర్ జనతా న్యూస్ : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ గ్రామపంచాయతీ శివారులో ఎల్ఎండి రిజర్వాయర్ సమీపంలో దారుణం చోటుచేసుకుంది. చేతులు తాడుతో కట్టి చెట్టుకు ఉరి వేసి యువకుడి మృతదేహం వేలాడదీసి ఉన్నది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు

సదాశివపల్లికి చెందిన జార్తి శ్రీనిథ్ (22) గా గుర్తించారు. సమాచారం అందుకున్న ఎల్ఎండి, చిగురుమామిడి ఎస్సైలు సయ్యద్ అన్వర్, పృథ్వి గౌడ్ తో పాటు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం తో దర్యాప్తు చేపట్టారు. అనంతరం డెడ్ బాడీని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు పేర్కొన్నారు. మృతుడు ఇటీవలే కరీంనగర్ లోని శ్రీ చైతన్య ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. ఘటన స్థలంలో బుల్లెట్ బైక్, 3 బీర్ బాటిల్స్ లభ్యం కావడంతో వాటిని, సెల్ ఫోను క్లూస్ టీం పోలీసులు పరిశీలిస్తున్నారు. శనివారం ఉదయం శ్రీనిద్ కొంత డబ్బును ఇతరులకు ఆన్లైన్ బదిలీ చేసినట్లు, కొంత నగదు తీసుకొని బయటకి బయలుదేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనిద్ ను ఎవరో ఉరి వేసి చంపినట్టు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా మృతిని తల్లి కనక లక్ష్మీ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండిఎస్ఐ అన్వర్ తెలిపారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com